టాస్ ఎవరిది? ..ఏ టీమ్ గెలుస్తుంది?

ఐపీఎల్ బెట్టింగ్ రాయుళ్లపై పోలీసుల ఫోకస్
సోషల్ మీడియాలో 129 ప్రొఫైళ్లు,
494 పెయిడ్ అడ్వర్టైజ్‌మెంట్ బ్లాక్
ప్రకటనలు నమ్మి మోసపోవద్దు : సిపి సజ్జనార్

హైదరాబాద్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త: పీఎల్ క్రికెట్ సీజన్‌లో పెరుగుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలపై హైదరాబాద్ పోలీసులు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. టాస్, మ్యాచ్ ఫలితాలను ముందే చెబుతామంటూ సోషల్ మీడియాలో ప్రకటనలు ఇచ్చే 129 ప్రొఫైళ్లను, 494 పెయిడ్ అడ్వర్టైజ్‌మెంట్లను అధికారులు బ్లాక్ చేశారు. కొంత మంది ఇన్ఫ్లుయెన్సర్లు డబ్బు కోసం చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రజలకు సూచించారు. బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐపీఎల్ సందడి నెలకొంది. క్రికెట్ అభిమానులు మ్యాచ్‌లను ఆస్వాదిస్తుంటే.. అదే సమయంలో బెట్టింగ్ రాయుళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుని కోట్లు కొల్లగొడుతున్నారు. ఐపీఎల్ ప్రిడిక్షన్ పేరిట సామాన్యులకు అత్యాశ చూపి, వారిని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారు. సోషల్‌మీడియాలో కొంతమంది ఇన్ఫ్లుయెన్సర్లు డబ్బు కోసం బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు."టాస్ ఎవరు గెలుస్తారు? మ్యాచ్ ఏటీమ్ విజయం సాధిస్తుంది?" అని తాము ముందే చెబుతామంటూ ఫేక్ ప్రిడిక్షన్ ఛానెల్స్ క్రియేట్ చేసి ప్రజలను సబ్‌స్క్రైబ్ చేసుకునేలా ప్రేరేపిస్తున్నారు. ఈక్రమంలో యూజర్లను బెట్టింగ్ యాప్స్, వెబ్‌సైట్లకు మళ్లించి వారి కష్టార్జితాన్ని కొల్లగొడుతున్నారు. ఇటువంటి అసత్య ప్రచారాలు చేసే వారిపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ కఠిన హెచ్చరికలు జారీ చేశారు. అదే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "ఐపీఎల్ ప్రిడిక్షన్ పేరిట ఆన్‌లైన్ బెట్టింగ్ ఉచ్చుతో జాగ్రత్త. ఐపీఎల్ క్రికెట్ ఫీవర్‌ను ఆసరాగా చేసుకుని సోషల్ మీడియాలో కొందరు మోసపూరిత ప్రకటనలతో విరుచుకు పడుతున్నారు. కేవలం డబ్బు కోసం కొంతమంది ఇన్ఫ్లుయెన్సర్లు అసత్య ప్రచారాలు చేస్తూ సామాన్యులను తప్పుదోవ పట్టిస్తున్నారు. టాస్ ఎవరిది!? మ్యాచ్ ఏ టీమ్ గెలుస్తుంది!? అని ముందేచెబుతామంటూ మిమ్మల్ని తమ ఛానెల్స్‌లో సబ్‌స్క్రైబ్ చేయించుకుని నిలువునా ముంచే బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారు. ఇలాంటి ఫేక్ ప్రిడిక్షన్ ఛానెళ్ల మాటలు నమ్మి మీ కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దు. ఇలాంటి ప్రమోషన్ల విషయంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠినంగా వ్యవహరిస్తోంది. గత నెల రోజుల్లోనే 494 పెయిడ్ ప్రకటనలను, వాటిని ప్రచారం చేస్తున్న 129 సోషల్ మీడియా ప్రొఫైళ్లను బ్లాక్ చేయించాం. ఈ నిఘా నిరంతరం కొనసాగుతుంది. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇలాంటి మోసపూరిత యాడ్స్ మీ దృష్టికి వచ్చినా మీరు మోసపోయినా వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయండి." అని సీపీ సజ్జనార్ ట్విట్టర్ ఎక్స్ వేదికగా ప్రజలకు సూచించారు. క్రికెట్ అనేది కేవలం వినోదం మాత్రమేనని.. దానిని జూదంగా మార్చుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని ముఖ్యంగా యువత ఇటువంటి ప్రకటనలకు ఆకర్షితులై ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది ఒక వ్యసనంగా మారి చివరకు ఆత్మహత్యల వరకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



హైదరాబాద్ వార్త

ఐటీ కారిడార్‌లో "హైడ్రా భారీ ఆపరేషన్"

రూ. 1200 కోట్ల విలువైన భూమికి రక్షణ.. 8ఎకరాలకు పైగా చుట్టూ ఫెన్సింగ్

హైదరాబాద్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త: ఐటి కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. బడా నిర్మాణ సంస్థల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లోని సర్వే నంబర్ 55లోని 8 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమిని మంగళవారం హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఐటీ హబ్‌కి చేరువలో బడా రియల్ ఎస్టేట్ సంస్థల స్వాధీనంలోఉన్న 4.20 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు.. మాధవరెడ్డి కూతురు సబితకు చెందిన 4 ఎకరాల భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఇందులో తాత్కాలికంగా వేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది. ప్రభుత్వభూమిలో నెలకొల్పిన ఆర్‌సీసీ ప్లాంట్‌ను నిర్మాణ సంస్థ స్వయంగా తొలగించుకుంది. కార్మికుల కోసం వేసిన తాత్కాలిక షెడ్డులను హైడ్రా తొలగించింది. మొత్తం 8 ఎకరాలకుపైగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను హైడ్రా తొలగించి బోర్డులు ఏర్పాటు చేసింది. మంగళవారం హైడ్రా కాపాడిన భూమి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ. 1200 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

గతంలోనూ ఇక్కడ ఆక్రమణలను హైడ్రా తొలగించింది. సర్వే నంబరు 53లోని మొండికుంట ఆక్రమణలతోపాటు..సర్వే నంబరు 55లోని ప్రభుత్వ భూమిని 11 ఎకరాల వరకూ స్వాధీనం చేసుకున్న విషయం విధితమే.

ఆక్రమణలను తొలగిస్తున్న హైడ్రా జెసిబి

అసైన్డ్ భూముల పేరుతో...

శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లోని సర్వే నంబర్ 55లో ఉన్న భూమి అసైన్డ్ ల్యాండ్. రంగారెడ్డి కలెక్టర్ ఈ భూమిని ప్రొహిబిటెడ్ లిస్టులో ఇప్పటికే పెట్టారు. దీని ప్రకారం ప్రభుత్వానికి చెందినదిగా పేర్కొన్నారు. అదే భూమిని తమదిగా ఓరియల్ ఎస్టేట్ సంస్థ చెబుతూ వస్తోంది. అలాగే మరోసంస్థ అందులో ఆర్‌సీసీ ప్లాంటులతో పాటు.. భవన నిర్మాణ కార్మికులకు షెడ్డులు వేసింది. అలాగే నిర్మాణ సామగ్రిని కూడా అందులో ఉంచింది. ఇలా విని యోగించుకుంటూ మొత్తం 4.20 ఎకరాల భూమిని తన స్వాధీనంలో ఉంచుకుంది. ఈ రెండు సంస్థలకు తోడు ఇదే సర్వే నంబరులో ఉన్న మరో 4 ఎకరాల భూమిని మాధవరెడ్డి కుమార్తె సబిత తనదిగా చెబుతూ వస్తున్నారు. బౌన్సర్లను కాపలాగా ఉంచారు. హైడ్రాకు ఫిర్యాదు అందడంతో కమిషనర్ రంగనాథ్ ఆదేశాలమేరకు క్షేత్రస్థాయిలో సబంధిత శాఖల అధికారులతో కలిసి హైడ్రా విచారించింది. అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుంది. కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. మొత్తం 8 ఎకరాలకు పైగా ఉన్న భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేశారు. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు.

అధికారులకు "ఎలక్ట్రిక్ వాహనాలు"

కమిషనర్, జెడ్‌సిలతోపాటు హెచ్‌ఓడీలకు సైతం
అడిషనల్ కమిషనర్ (అడ్మిన్)కు పరిపాలన పగ్గాలు
పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంపు
సిఎంసి స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం

సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి జయేష్‌రంజన్

హైదరాబాద్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయాలని స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్ణయించింది. కమిషనర్, జోనల్ కమిషనర్లతోపాటు ఆయా విభాగాల హెచ్‌ఓడీలకు సైతం ఎలక్ట్రిక్ వెహికిల్స్ కేటాయించాలని నిర్ణయించారు. ఈమేరకు మంగళవారం స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన సీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం మాదాపూర్‌లోని న్యాక్ బిల్డింగ్ లో నిర్వహించారు. ఈ సమావేశంలో మౌలిక సదుపాయాలు, పౌర సేవలు, పర్యావరణ నిర్వహణను మెరుగుపరచడానికి మొత్తం 15 ఎజెండా అంశాలను చర్చించి ఆమోదించారు. ముఖ్యమైన అంశాల్లో మెరుగైన పరిపాలన కోసం అడిషనల్ కమిషనర్‌కు పరిపాలన అధికారాలను అప్పగించాలని నిర్ణయించారు. పారిశుధ్య కార్మికులకు (శానిటరీ వర్కర్, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్, శానిటరీ రిసోర్స్ పర్సన్)లకు జీహెచ్‌ఎంసీ సిబ్బందితో సమానంగా ఈనెల 1వ తేది నుంచి 31మార్చి2027 వరకు వేతనాలను పెంచాలని నిర్ణయించారు. రోడ్ల నెట్వర్క్, రవాణా సౌకర్యాలను బలోపేతం చేయడం, వరదనీటి కాలువ వ్యవస్థను మెరుగుపరచడం, పౌర ఆరోగ్యం, పారిశుధ్య సేవలను మెరుగుపరచడం, పార్కులు, చెరువుల పునరుద్ధరణ ద్వారా పర్యావరణ పరిరక్షణ, పట్టణ పాలన మరియు సేవల డెలివరీని వేగవంతం చేయడం వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశం నిర్ణయించింది. ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధి, మెరుగైన పౌర మౌలిక సదుపాయాలు మరియు పర్యావరణ స్థిరత్వం పట్ల కార్పొరేషన్ తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. సంబంధిత విభాగాలన్నీ పనులను వెంటనే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సమావేశం నిర్ణయించింది.



లబ్ధిదారునికి డబుల్ బెడ్ రూం పట్టా అందిస్తున్న డా. జి.చిన్నారెడ్డి.

సిఎం ప్రజావాణిలో 505 దరఖాస్తులు

సిఎం ప్రజావాణీ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ చిన్నారెడ్డి

బేగంపేట ఏప్రిల్ 7, ప్రభాతవార్త: సిఎం ప్రజావాణీ చొరవతో జనార్ధన్ పద్మజ జంటకు డబుల్ బెడ్‌రూం మంజూరైంది. లబ్దిదారులకు ఇంటి పట్టా ను సీఎం ప్రజావాణీ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి అందజేసారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ వేదికగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో డబుల్ బెడ్ రూం లబ్దిదారు లను అభినందించి ఇంటిని జాగ్రత్తగా చూసుకోవాలని చిన్నారెడ్డి లబ్దిదారు లను ఆశీర్వదించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎం ప్రజా వాణీ ఇన్‌చార్జ్ చిన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంట లెక్చువల్స్ అధ్యక్షులు శ్యాంమోహన్‌లకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. భువనగిరి జిల్లా మద్దూం పల్లికి చెందిన జనార్థన్ నాలుగు దశాబ్దాల క్రితం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో నివాసం ఉంటు న్నాడు. డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం సీఎం ప్రజా వాణీలో దరఖాస్తు చేసుకోగా కూకట్‌పల్లి ఖైతలా పూర్‌లో డబుల్ బెడ్‌రూంను మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్ మనుచౌదరి కేటాయిస్తూ ఉత్వర్వులు జారీ చేసారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజావాణీలో మొత్తం 505 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 170 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 65, ఇందిరమ్మ ఇళ్లకు 156, ప్రవాసీ ప్రజావాణీకి 5 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖ లకు సంబంధించి 109 దరఖాస్తులు అందాయి. డా. జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

ఈ కార్యక్రమంలో స్టేట్ నోడల్‌అధికారి దివ్యదేవ రాజన్, అదనపు కలెక్టర్ సూర్యప్రకాష్, ఏసీపీ ఉమేందర్, ఎన్ఆర్ఐ సలహా మండలి వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, ప్రవాసీ ప్రజావాణీ సమన్వయ కర్త బొజ్జా అమరేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వివరాలు తెలుపుతున్న సిఐ సైదేశ్వర్

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

సైఫాబాద్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : పట్టపగలు ఇండ్లలో తాళాలు పగలగొట్టి చోరీలు చేస్తున్న వ్యక్తిని నారాయణగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గత నెల 30వ తేదీన హిమాయత్‌నగర్‌లోని స్ట్రీట్ నెంబరు 15లో నివాసం ఉంటున్న ఫాతిమా, స్ట్రీట్ నెంబరు 10లో ఉంటున్న యోగేంద్ర తమ ఇంట్లో దొంగతనాలు జరిగాయని నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి సిసిటీవీ కెమెరాలు, నిందితుడి మొబైల్ సిగ్నల్‌పై నిఘా పెట్టారు. ఈ నెల 6వ తేదీన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద నిందితుడి తిరుగుతుంటే పోలీసులకు అనుమానం వచ్చి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళి విచారించగా అసలు విషయం బయటపడింది. బెంగాల్ కోల్‌కతాకు చెందిన షేక్ హాఫీజుల్(37) నగరంలో శారీ డిజైనింగ్ వర్క్ చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన హాఫిజులాకు వచ్చే సంపాదన చాలకపోవడంతో చోరీలకు ప్లాన్ వేశాడు. పగటిపూట తాళాలు వేసిన ఇళ్లను రెక్కి చేసి దొంగతనాలు చేసేవాడు. ఇలా కూకట్‌పల్లి, సనత్‌నగర్, నారాయణగూడ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఆరు దొంగతనాలకు పాల్పడ్డాడని నారాయణగూడ పోలీస్ స్టేషన్ సిఐ సైదేశ్వర్ తెలిపారు. మొత్తం రెండు లక్షల రూపాయల విలువగల బంగారు ఆభరణాలను అతను దొంగతానికి పాల్పడ్డారని సిఐ వివరించారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న న8 మంది వాహనదారులపై కేసు నమోదు

సైదాబాద్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో చంద్రాయణగుట్ట ఎసిపి చంద్రకుమార్ పర్యవేక్షణలో మంగళవారం డిఎంఆర్‌ఎల్ చౌరస్తాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సెల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేస్తున్న 8 మందిపై, ఇతర ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 12 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎసిపి చంద్ర కుమార్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్‌లు మాట్లాడుతూ సెల్‌ఫోన్ సంభాషణ కంటే ప్రాణం విలువైనదని గుర్తించాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్ వల్ల వారితో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. అత్యవసరంగా మాట్లాడాల్సి వస్తే వాహనాన్ని రోడ్డు పక్కన సురక్షితంగా ఆపిన తర్వాత మాత్రమే మాట్లాడాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ప్రతి ఒక్కరు తప్పని సరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

పెట్రోల్ బంక్ క్యూ లైనులో వివాదం

ఆటో డ్రైవర్‌పై దాడి

అల్వాల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: పెట్రోల్ బంక్ క్యూ లైనులో వివాదం నేపధ్యంలో ఆటో డ్రైవర్‌పై దాడి జరిగిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈ నెల 6వ తేదీ సోమవారం మద్యాహ్నం రెండున్నర గంటలు సమయంలో మచ్చబొల్లారం కొత్తబస్తీ నివాసి అయిన ఆటో డ్రైవర్ శ్రీపతి ఎల్‌పిజి కోసం కానాజీగూడా పెట్రోల్ బంక్ క్యూ లైనులో ఉండడం జరిగింది. మద్యాహ్నం 3.30 గంటలు సమయం కావడంతో శ్రీపతి భోజనం కోసం అక్కడే ఉన్న హోటల్‌లోకి వెళ్ళగా కొడుకు నితీష్ జితేందర్(21)ను ఆటో వద్ద ఉంచాడు. కొద్ది సేపటికి నెంబరు ప్లేటు లేని ఓ ఆటో క్యూ లైను మద్యంలోకి వచ్చి నిలబడింది. ఆటో క్యూ లైనును కాదని మద్యలోకి రావడంతో నితీష్ జితేందర్ డ్రైవర్‌ను ప్రశ్నించారు. వివాదం ప్రారంభమైన వెంటనే నెంబరు ప్లేటు లేని ఆటోలో నుంచి గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు బయటకి వచ్చి నితీష్‌పై కత్తితో దాడి చేశారు. కుడి కన్ను సమీపంలో గాయడం కావడం ఇది గమనించిన అతని తండ్రి శ్రీపతి నిందితులకు ఎదురు తిరగడంతో అతనిని కూడా గాయ పరిచారు. వివాదం ముదరడంతో అక్కడి నుంచి ఆటోలో వచ్చిన వారందరూ పారి పోయారు. బాధితుడు నితీష్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాలతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

సంజీవరెడ్డినగర్‌లో బియ్యం పట్టివేత

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త: సంజీవరెడ్డినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సార్ నగర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, మంగళవారం పెట్రోలింగ్ డ్యూటీలో భాగంగా గస్తీ కాస్తున్న సిబ్బంది సనత్‌నగర్ స్వామీ టాకీస్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఏపి 28 టిబి 2852 నంబరు ఆటోను అడ్డగించారు. అందులో పరిశీలించగా డ్రైవర్ షేక్ జలీల్ తన సహచరులతో కలిసి అల్లాపూర్ పీఎస్ పరిధిలోని బోరబండకు అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. ఒక ఆటో, ఒక టాటా ఏస్ వాహనం, ఒక ద్విచక్రవాహనం ద్వారా మొత్తం 36 బస్తాల బియ్యం (సుమారు 18 క్వింటాళ్లు) రవాణా చేస్తున్నట్లు బయటపడింది. పోలీసులు బియ్యం, మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు కింద పడి వృద్ధుడి మృతి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త : ఆర్టీసీ బస్సు కింద పడి ఒక వృద్ధుడు మృతిచెందిన సంఘటన మధురానగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకొంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడలో ఒక వృద్ధుడు ఆర్టీసీ బస్సు కింద పడి మృతిచెందాడు. రోడ్డు దాటే క్రమంలో ప్రమాదావశాత్తు బస్సు కింద పడి మృతిచెంది ఉంటాడని భావించారు. అయితే పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా వృద్ధుడు బస్సు కింద కావాలనే పడిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ప్రాథమిక విచారణలో భాగంగా మృతుడిని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీనప్పగా పోలీసులు గుర్తించారు. మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల వేధింపుల భరించలేక

మహిళ ఆత్మహత్యాయత్నం

ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన మహిళ

గన్‌ఫౌండ్రి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: గాంధీనగర్ పోలీసులు వేధింపులు భరించలేక ఓ మహిళా ఏకంగా నాంపల్లిలోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయం ముందు మహిళా ఆత్మహత్యాయత్నానికి యత్నించిన సంఘటన మంగళవారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...కవాడిగూడ ప్రాంతానికి చెందిన శ్రావణిని గాంధీనగర్ పోలీసులు వేధిస్తున్నారని ఏకంగా నాంపల్లిలోని మానవ హక్కుల కమిషన్ కార్యాలయానికి చేరుకుంది. ఏకంగా శ్రావణి వెంట తెచుకున్న పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. అక్కడే డ్యూటీలో ఉన్న పోలీసులు గమనించి ఆమెను అడ్డుకుని చేతిలో ఉన్న పెట్రోల్ బాటిల్‌ను లాక్కున్నారు. అసలు ఏమి జరిగిందని, ఎందుకు ఆత్మహత్యాయానికి పాల్పడుతున్నావని పోలీసులు ఆమె అడిగారు. గాంధీనగర్ పోలీసులు తనను కొద్ది రోజుల నుంచి వేధింపులు గురిచేస్తున్నారని సదరు మహిళ డ్యూటీలో పోలీసులకు చెప్పింది. వెంటనే మహిళాను కమిషన్ ఛైర్మన్ వద్దకు తీసుకువెళ్లి హెచ్‌ఆర్‌సి ముందు ప్రవేశ పెట్టారు. డ్యూటీలో ఉన్న పోలీసులు సహకాలంలో స్పందించడం ద్వారా ఆమహిళా ప్రాణాలను కాపాడారు. అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అవార్డును అందుకుంటున్న నిమ్స్ ఫిజియోథెరపీ వైద్యులు

నిమ్స్ ఫిజియోథెరపీ విభాగానికి ప్రతిష్టాత్మక రాష్ట్ర పురస్కారం

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త : ఉత్తమ ఆరోగ్యసేవలకుగాను నిమ్స్ ఫిజియోథెరపీ విభాగానికి ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సేవ పురస్కారం దక్కింది. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నరసింహ, ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్. చోంగ్తు, నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ఇతర ప్రముఖుల సమక్షంలో ఈ అవార్డును ప్రధానం చేశారు. ఈ పురస్కారాన్ని ఫిజియోథెరపీ విభాగానికి చెందిన వైద్యులు డా. నాగ శ్రవణ కుమార్ జంప, డా. నవీన్ కుమార్ బాల్నే, డా. సునీత్ వాఘ్రాయ్, డా. ప్రవీణ్ దౌలే, డా. లక్ష్మణ ప్రసాద్ గడ్డే స్వీకరించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప మాట్లాడుతూ, ఫిజియోథెరపీ విభాగం అంకితభావం, నిబద్ధత, నాణ్యమైన ఆరోగ్య సేవలు, రోగుల సంరక్షణలో చేసిన విశిష్ట కృషి కారణంగా ఈ అవార్డు దక్కిందన్నారు.

అనధికార నిర్మాణాలు, సెల్లార్‌లను తొలగించాలి

టౌన్ ప్లానింగ్ సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్‌లో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : మల్కాజిగిరి నగరపాలక సంస్థ (ఎంఎంసి)పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో చీఫ్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్), భవన నిర్మాణ అనుమతులు, ట్రాన్స్ ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్) దరఖాస్తుల పెండింగ్ స్థితిపై టెలికాన్ఫరెన్స్‌లో సర్కిల్ వారిగా సమీక్షించారు. ఈ ప్రక్రియల్లో ఎటువంటి ఆలస్యం జరగకుండా సర్వీస్ లెవల్ అగ్రిమెంట్స్ (ఎస్ఎల్ఎ)ను అమలు చేయాలని కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. అదేవిధంగా, నగరంలో జరుగుతున్న అనధికార కార్యకలాపాలపై తగిన స్థాయిలో చర్యలు తీసుకోకపోవడంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఫుట్‌పాత్‌లు, నాలాలపై ఉన్న అక్రమ ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. నివాస కాలనీలలో ఉన్న అనధికార నిర్మాణాలు, అనుమతి లేని సెల్లార్‌లు, రోడ్ ఆక్రమణ చేస్తున్న ర్యాంపులు, మొక్కలు లేని ప్లాంటర్ బాక్సులను గుర్తించి తక్షణమే తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యల ద్వారా నగరంలోని ప్రజా ప్రదేశాలను పరిరక్షి స్తూ, పట్టణ ప్రణాళిక నిబంధనలను అమలు చేయడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించాలనే లక్ష్యాన్ని కమిషనర్ పునరుద్ఘాటించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్‌కుమార్, ప్రణాళిక విభాగంలో సిటీ ప్లానర్లు, జోనల్ సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు పాల్గొన్నారు.

18 కేంద్రాల్లో ఆరోగ్య శిబిరాలు...

ఎంఎంసి పరిధిలో ప్రజా ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతంగా కొనసాగుతోంది. ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు 18 ప్రాంతాలలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి 2,116 మంది పారిశుధ్య, వెటర్నరీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ప్రతి కార్మికుడి ఆరోగ్యం మా ప్రాధాన్యతని, ఆరోగ్య శిబిరాలను క్రమంగా నిర్వహిస్తూ, వారికి అవసరమైన వైద్య సేవలను అందించేందుకు సంస్థ పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. ఎంఎంసి అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ వైద్య శిబిరాలలో సాధారణ ఆరోగ్య పరీక్షలతోపాటు రక్తపోటు, గుండె సంబంధిత పరీక్షలు, కంటి, చెవి తదితర ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేపట్టారు. అర్హులైన కార్మికులకు అవసరమైన మందులు ఉచితంగా అందించడంతో పాటు, వైద్యుల ద్వారా తగిన సలహాలు ఇచ్చారు. నగర సేవలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య, వెటర్నరీ కార్మికుల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించడం ద్వారా శుభ్రమైన నగరం, ఆరోగ్యవంతమైన సమాజం అనే లక్ష్య సాధనకు ఎంఎంసి కట్టుబడి ఉందన్నారు.

టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న వినయ్ కృష్ణారెడ్డి

వైద్యపరీక్షలు చేయించుకుంటున్న డిఆర్‌వో వెంకటాచారి తదితరులు

ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి : డిఆర్‌వో

హైదరాబాద్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌వో వెంకటాచారి మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధుల నిమిత్తం వైద్య పరీక్షలకు సమయం కేటాయించడం కష్టమవుతున్న నేపథ్యంలో ఇలాంటి శిబిరం నిర్వహించడం అవసరం అన్నారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం నిర్వహించిన ఎన్‌టిసిపి చైర్మన్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ శిబిరంలో రక్తపోటు, మధుమేహం, కంటి పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు జిల్లా క్షయ నియంత్రణ కార్యాలయం ద్వారా ఛాతీ ఎక్స్ రే సదుపాయం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ శిబిరంలో 180 మంది వరకు అధికారులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొని రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి, కంటి చూపు, రక్త పరీక్షలు అలాగే ఎక్స్ రే పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జ్యోతి, లాఆఫీసర్ శ్రీధర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విజయలక్ష్మి, జిల్లా క్షయనియంత్రణ అధికారి డా.చల్లా దేవి వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దళితుడికి సమాన హక్కులు కల్పించాలి

ధర్నాలో నినాదాలు చేస్తున్న బహుజన్ ముక్తి నాయకులు

ధర్నాచౌక్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త: మత భేదం లేకుండా ప్రతి దళితునికి సమాన హక్కులు కల్పించాలని భారత్ ముక్తి మోర్చా నాయకులు దేవతి శ్రీనివాస, మట్టి ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో భారత్‌ముక్తి మోర్చా ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇటీవల షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి మతం మారితే ఎస్సీ హోదా కోల్పోతారని ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను బలహీనపరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మత మార్పిడి జరిగినప్పటికీ, ఎస్సీ వర్గాలపై సామాజిక వివక్ష పూర్తిగా తొలగిపోదని, అందువల్ల ఎస్సీ హోదా రద్దు చేయటం సార్వత్రిక సమానత్వం మరియు రాజ్యాంగ నైతికతకు విరుద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు దాసురం నాయక్, రాష్ట్ర అధ్యక్షులు అంసోలె లక్ష్మణ్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, పులి కల్పన, భారత్ ముక్తి మోర్చా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్‌నాయక్, భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కన్వీనర్ భూంపల్లి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడిచేయటం దుర్మార్గం

సికింద్రాబాద్ పార్లమెంట్ టిడిపి నేతలు

మాట్లాడుతున్న టిడిపి నేతలు

ముషీరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని ఒక మీడియా కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడిచేయటం దుర్మార్గమని సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌లు ధ్వజమెత్తారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీనేతలు ఆందోళన ముసుగులో భౌతిక దాడులకు దిగడం, కార్యాలయంలోనికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించటం ప్రజాస్వామ్యం మీదవారు చేసిన దాడిగా వారు అభివర్ణించారు. మావిగన్ భయం జగన్‌ను వెంటాడుతోందని, ప్రజలకు వాస్తవాలను తెలియచేయటం భరించలేక, మీడియాపై వైసీపీ ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. మహిళలను అడ్డుపెట్టుకుని దాడులు చేయటం నీతిమాలిన చర్య అని, జగన్ తనకు భజన చేసే మీడియా తప్ప, వాస్తవాలు రాసే మీడియా అంటే విద్వేషమనే విషయం ఈ ఘటనతో మరోసారి బుజువైందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్‌శాఖ ఇటువంటి దాడులను తీవ్రంగా పరిగణించాలని, మీడియా సంస్థలకు రక్షణ కల్పించాలని, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్యాంసుందర్, కరణం కిరణ్, భానుప్రకాష్, ఎస్.ప్రకాష్, సుక్రవేది పాల్గొన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

గంగపుత్ర ఆత్మగౌరవ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న నేతలు

హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త: గంగపుత్రుల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, తెలంగాణ ఫిషరీస్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం వారు గత ప్రభుత్వం గంగపుత్రుల కోసం ఉప్పల్ భగాయత్‌లో మూడెకరాల స్థలంతో పాటు భవన నిర్మాణం కోసం మూడు కోట్ల రూపాయలు కేటాయించిన స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగపుత్రుల ఆత్మగౌరవ భవన నిర్మాణ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని, భవన నిర్మాణం పూర్తిచేసి, గంగపుత్రులకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నేతలు చంద్రప్రకాష్, బాలయ్య, మల్లేష్, అంబటి సుధాకర్, రాంచందర్, గడప శంకర్, సదానంద్, పూస నర్సన్న, గిరిబాబు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలి : రామకృష్ణారెడ్డి

నార్సింగి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : ఆరోగ్య సంరక్షణపై ప్రజలు దృష్టి సారించాలని మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మణికొండ అంజలీ గార్డెన్‌లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో రామకృష్ణారెడ్డి బిపి చెక్ చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగం వచ్చాక బాధపడడంకన్నా, అది రాకుండా ముందు జాగ్రత్తలు పాటించడం మంచిదన్నారు. క్రమం తప్పకుండాచేసే వ్యాయామం, యోగ, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, ధ్యానం ఆరోగ్యంను పెంపొందిస్తాయన్నారు. సాధ్యమైనంత వరకు సేంద్రీయ ఎరువులతో పండించిన ఆహార ధాన్యాలు తీసుకోవాలని, రసాయన ఎరువులతో పండించిన ధాన్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుద్దోలు శ్రీరాములు, ఏర్పుల కుమార్, శ్రవణ్, గంగాధర్ పాల్గొన్నారు.

ఎబిఎన్-ఆంధ్రజ్యోతి కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ ఆందోళన

జుబ్లీహిల్స్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. మాజీ మంత్రి అంబటి రాంబాబుతోపాటు వైసీపీ నేతలు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, లక్ష్మీపార్వతి, పినిపె విశ్వరూప్, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, మార్గాని భరత్, కారుమూరి, ఇజ్రాయిల్, కల్పలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. 'వీకెండ్ కామెంట్ బై ఆర్కే' పేరుతో ప్రసారమైన కథనంతోపాటు, మహిళలను కించపరిచే విధంగా రాతలు రాస్తుందని, మహిళల వ్యక్తిత్వ హననం చేస్తుందని, సంస్కారం మరుస్తున్నారని ఆందోళనకు దిగారు. వైసీపీ నేతలు తొలుత ఫిల్మ్‌నగర్ క్లబ్‌వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడున్న పోలీసులు వారిని అడ్డుకొనేందుకు యత్నించారు. తాము శాంతియుతంగా ఆందోళన చేస్తామని మాజీమంత్రి, వైసీపీనేత అంబటి రాంబాబు పోలీసులకు స్పష్టం చేశారు. వైసీపీ శ్రేణులు పాదయాత్రగా ప్లకార్డులు పట్టుకొని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం వైపు వెళ్లాయి. ఏబీఎన్ కార్యాలయం ముందు ప్లకార్డులు పట్టుకొని ఆందోళనకు దిగిన వైసీపీ నాయకులు, శ్రేణులు ఒక్కసారిగా పోలీసులను తోసుకొని ఏబీఎన్ కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించాయి. ఏబీఎన్ డౌన్‌డౌన్ అంటూ కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఫిల్మ్‌నగర్ పోలీసులు వారిని అడ్డుకొన్నారు. దీంతో పోలీసులకు, వైసీపీ శ్రేణులకు మధ్య తోపులాట చోటుచేసుకొంది. కొందరు నేతలు పరుగులు తీస్తూ కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారు. ఒక పోలీసు అధికారి అతన్ని నియంత్రించే క్రమంలో చెంప చెళ్లుమనిపించారు. వైసీపీ శ్రేణులను అక్కడి నుంచి తరలించారు. మరోవైపు జుబ్లీహిల్స్‌లోని ఆంధ్రజ్యోతి కార్యాలయం ముందు, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ నివాసం ముందు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సంఘటనపై ఏబీఎన్ నుంచి ఫిర్యాదు అందినట్లు ఫిల్మ్‌నగర్ పోలీసులు తెలిపారు. మరోవైపు ఏబీఎన్‌పై వైసీపీ దాడిని ఖండిస్తున్నట్లు తెలంగాణ తెలుగు యువత నాయకులు మల్లికార్జున నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏబీఎన్ కార్యాలయం ముందు ప్లకార్డులతో ఆందోళన నిర్వహిస్తున్న అంబటి రాంబాబు తదితరులు

మాజీ మంత్రుల అరెస్టుపై

బిఆర్‌ఎస్ శ్రేణుల ఆగ్రహం

నార్సింగి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు మద్దతు తెలిపిన మాజీ మంత్రులు హరీష్‌రావ్, సబితారెడ్డి, దయాకర్‌రావ్‌లను అరెస్టు చేయడం పట్ల మణికొండ బిఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ నాయకత్వంలో నాయకులు నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మణ్ రావ్, రూపారెడ్డి, సుమనళిని, ఆరిఫ్, రేఖ, వెంకట్, రవిలు మణికొండలో కాంగ్రెస్ సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతో నష్టపోతున్న రైతులకు అండగా నిలువడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజాస్వామ్యంను ఖూనీ చేసి నియంత పాలన, పోలీసు పాలనను చేస్తున్నారన్నారు. పరిగిలో అన్యాయంగా అన్నదాతల భూములు లాక్కొని వారిని రోడ్డు పాలు చేస్తున్న ఈ సర్కారుకు పుట్టగతులుండవని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటుపోటు తప్పదని హెచ్చరించారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యాలు కూలిపోవడం ఖాయమన్నారు. బాధిత ప్రజల తరపున మాట్లాడటం, నిరసన వ్యక్తం చేయడం కూడా తప్పా అని మండి పడ్డారు. మాజీ మంత్రులను గృహనిర్బంధం చేయడం, అక్రమంగా అరెస్టులు చేయడం వంటి నియంతృత్వపు చర్యలను రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. మా నాయకులు తెలంగాణ ఉద్యమంలో లాఠీ దెబ్బలు తిని, జైళ్లకు వెళ్లి, వేల కేసులను ఎదుర్కొన్నారని, ఈ కాంగ్రెస్ సర్కారు పెట్టే లొట్టపీసు కేసులకు జడిసేది లేదని, బాధిత ప్రజల పక్షాన పోరాడి తీరుతామని, న్యాయం జరిగేంత వరకు ఉద్యమిస్తామని, కోర్టులను ఆశ్రయిస్తామని సీతారాం ధూళిపాళ స్పష్టం చేశారు.

పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్న సిఎం సహాయ నిధి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగ్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : సీఎం సహాయ నిధి పేదలకు కార్పోరేట్ వైద్యంను అందించడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మణికొండ డివిజన్‌కు చెందిన గోపాల్ సింగ్ లోధా కుమారుడు పియూష్‌సింగ్ లోధా(10) నరాల జబ్బుతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ బాలుడికి మెరుగైన వైద్యంను అందించేందుకు మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి మంగళవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను ఆశ్రయించారు. వెంటనే రూ.5.లక్షల ఎల్‌ఓసి చెక్కుని ప్రకాశ్‌గౌడ్ గోపాల్‌సింగ్ లోధాకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పెద్ద జబ్బులు వస్తే పేదలు ప్రాణాలపై ఆశలు వదిలేసుకునే వారని, ఇప్పుడు సీఎం సహాయ నిధివల్ల పెద్దజబ్బులకు అవసరమైన డబ్బులు సకాలంలో అందజేసి, మెరుగైన వైద్యం ఇప్పించడం జరుగుతుందన్నారు. రాజేంద్రనగర్ ప్రజలు నాకు ఓట్లు వేసి వరుసగా నాలుగు సార్లు అసెంబ్లీకి పంపించారని, వారి కష్టాలను దూరం చేసే బాధ్యతను నేను తీసుకుంటున్నానని తెలిపారు. అర్ధరాత్రి వేళ వచ్చి నా తలుపు తట్టినా స్పందించి సహాయం చేస్తానని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే స్పందన పట్ల నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీరాములు, కుమార్ తదితరులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రవణ్ కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు సేవ చేయడమే లక్ష్యం

సాఫా బైతుల్‌మాల్ స్వచ్ఛంద సంస్థ

హైదరాబాద్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త: నగరంలో పెరుగుతున్న జనాభా, మారుతున్న జీవనశైలి కారణంగా ముస్లింలు ఎదుర్కొంటున్న అంతిమ సంస్కారాల ఇబ్బందులను తొలగించేందుకు ప్రముఖ స్వచ్ఛంద సంస్థ సాఫా బైతుల్ మాల్ తన ప్రతిష్టాత్మక ఆఖరి సఫర్" (మొబైల్ ఘుస్ల్ సర్వీస్) సేవలను ప్రారంభించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు మోలానా ఘయాస్ అహ్మద్ రషాది, ప్రధాన కార్యదర్శి మోలానా ఫసిహ్ ఉద్దీన్ నద్వీలు తెలిపారు. ఈ మేరకు 9న టోలిచౌకి, కరణ్ సింగ్‌మార్గ్, గోల్కొండలో పూర్తిస్థాయిలో ఆధునీకరించిన రెండు కొత్త మొబైల్ ఘుస్ల్ వ్యాన్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత అపార్ట్‌మెంట్ సంస్కృతిలో అంతిమ సంస్కారాలకు (స్నానం, కఫన్ ధరింపజేయడం) స్థలం లేకపోవడం, ట్రాఫిక్ సమస్యలు, శిక్షణ పొందిన సహాయకుల కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. "గత ఐదేళ్లలో ఒకే వ్యాన్ ద్వారా దాదాపు 9,120 మందికి అంతిమ సంస్కారాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. డిమాండ్ పెరగడంతో మరో రెండు వ్యాన్లను అందు బాటులోకి తీసుకు వస్తున్నట్లు తెలిపారు. రెండు 100 లీటర్ల వాటర్ ట్యాంకులు, గీజర్ సౌకర్యం.ఆధునిక షవర్ సిస్టమ్, ఘుస్ల్ ప్లాట్‌ఫారమ్ డ్రైనేజీ ట్యాంక్ తదితర సదుపాయాలతోపాటు నలుగురు సభ్యులబృందం వ్యాన్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్‌ముహైమిన్ అజర్ అల్ ఖస్మీ సంయుక్త కార్యదర్శి మోలానా వా అబ్దుల్లా మాజ్ హుస్సామీ, కోశాధికారి మోలానా నసీమ్ ఉల్ హక్ బీట్ నదురి ఖాస్మీ పాల్గొన్నారు.

క్రెడిట్ చోరీ మానుకోవాలి

కాంగ్రెస్ నాయకులు

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త: సంజీవరెడ్డి నగర్ పరిధిలో కాంగ్రెస్ నాయకులు కష్టపడి చేసిన పనులకు చివరి నిమిషంలో వచ్చి క్రెడిట్ తీసుకోవడం సరికాదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌పై అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ ఆదేశాల మేరకు అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్ ప్రాంతాల్లో తాగునీరు, మురుగునీరు, విద్యుత్ సమస్యలను కాంగ్రెస్ నాయకులు రాత్రింబవళ్లు శ్రమించి పరిష్కరించారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వచ్చి తామే చేసిన పనులను తన ఖాతాలో వేసుకోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఇది పూర్తిగా క్రెడిట్ చోరీ అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తీరిన తరువాత ఫోటోలు దిగుతూ ప్రచారం చేసుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి ఉంటే ఇలాంటి తప్పుడు ప్రచారాలకు దిగరని, ఎవరు నిజంగా పని చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇకనైనా క్రెడిట్ రాజకీయాలు మానుకుని ప్రజల కోసం పని చేయాలని హితవు పలికారు. ఈ సందర్భంగా అమీర్‌పేట్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో నవీన్ రాజ్, రవి కిరణ్ దేవులపల్లి, శ్రీకాంత్ యాదవ్, ప్రతాప్ నాయక్, రాజేశ్వరి, రజినీకాంత్, దేవి, అమృత, పద్మావతి, అనిత, లక్ష్మి, మకళ, వినోద్ కుమార్, బ్రహ్మయ్య, దివాకర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

నాంపల్లి కోర్టు న్యాయమూర్తి వినోద్‌కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

న్యాయవాదులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని నాంపల్లి కోర్టు ఒకటవ అదనపు సెషన్స్ జడ్జి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ (సెషన్స్ విభాగం), నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రైమ్ కేర్ హాస్పిటల్, కేర్ హాస్పిటల్ల సహకారంతో నాంపల్లి కోర్టు భవన సముదాయ ప్రాంగణంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని వినోద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం కోర్టు కేసులతో బిజీగా వుండే న్యాయవాదులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రస్తుత కాలంలో జీవనశైలి మార్పుల కారణంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, అందువల్ల ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రతిరోజు వ్యాయామం, యోగా, ధ్యానం దిన చర్యలో భాగంగా వుండాలని పేర్కొన్నారు.జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి కమ్ సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి మాట్లాడుతూ ప్రజలలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతోపాటు, న్యాయ సేవలపై కూడా అవగాహన కల్పించడం న్యాయ సేవా సేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఆరోగ్యంతో పాటు న్యాయ సహాయం కూడా ప్రతి పౌరుడికి సమానంగా అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలి పారు. ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, వైద్య బృందం, స్వచ్ఛంద సేవకులకు అభినందనలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో 2డీ ఈకో పరీక్షలు, ఈసీజీ పరీక్షలు, కాలేయ (లివర్) పరీక్షలు, దంత పరీక్షలు, కంటి పరీక్షలు, అలాగే సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, షుగర్‌పరీక్షలు ఉచితంగా నిర్వహించబడ్డాయి.

ఈ కార్యక్రమంలో పట్టాభిరామ్, సీబీఐ ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, మైత్రేయి, అజయ్, నాంపల్లి కోర్టు బార్ అధ్యక్షుడు, రవి కిషోర్, ఇటీవల ఎన్నికైన అధ్యక్షుడు. రెట్టేల బాల రాజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, వైద్యులు పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణానికి వచ్చే, కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు.

రైతుల భూములు కబ్జా చేయడం దుర్మార్గం

సిపిఐ మాజీ ఎంపి సయ్యిద్ అజీజ్‌పాషా

హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త : రైతులు వ్యవసాయం చేసుకుంటున్న భూములను కబ్జా చేయడం దుర్మార్గమని సిపిఐ నేత, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాషా మండిపడ్డారు. వేల కోట్ల విలువైన ఈ ప్రభుత్వ నిషేధిత భూములను రక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో విచారణకి గట్టిగా వాదించే ప్రముఖ న్యాయవాదులను నియమించి, కోర్టు ద్వారానే కమిషన్ నియమింపజేసి నాదర్‌గుల్ గ్రామంలో ఈ భూములు పాట్ ఖరాబ్ లేక వ్యవసాయ భూముల తేల్చేలా చేయాలనీ ఆయన డిమాండ్ చేసారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారంపై సయ్యిద్ అజీజ్ పాషా నేతృత్వంలో సిపిఐ నిజనిర్ధారణ బృందం మంగళవారం కబ్జా చేసిన భూములను, అక్రమంగా నిర్మించిన కాంపౌండ్ వాల్‌లను, పరిశీలించారు. అక్కడే వ్యవసాయం చేసుకుంటున్న రైతులు వచ్చి తమ భూములు ఖాళీ చేయాలనీ గుండాలు, రౌడీలు. బౌన్సర్లు బెదిరిస్తున్నారని, ఈ భూముల్లో గత 60 సంవత్సరాల నుండి దాదాపు 130 కుటుంబాలు 600 రైతులు వ్యవసాయం చేసుకుంటున్నామని సయ్యిద్ అజీజ్ పాషాకు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లో ప్రభుత్వ భూములను తమ భూమి అంటూ బోర్డులు ఎలా పెడతాయని ప్రశ్నించారు. ప్రభుత్వ యంత్రాంగం నిద్రపోతున్నదా అని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ భూముల మధ్యలో లచ్చమ్మకుంట చెరువును కూడా కబ్జా చేయడంపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని అయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కబ్జాకు గురైన ఈ భూములని తిరిగి స్వాధీన పరుచుకోవాలని, అలాగే వ్యవసాయం చేసుకుంటున్న రైతుల భూములను వారికే అప్పగించాలని కోరారు. నాదర్‌గుల్ గ్రామంలో ప్రభుత్వ భూములను రక్షించేందుకు సిపిఐ పెద్దఎత్తున పోరాటం చేస్తామని అలాగే సాగు చేసుకుంటున్న రైతులకు అండగా ఉంటామని సయ్యిద్ అజీజ్ పాషా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు, సిపిఐ నాయకులూ ఆర్. గోపాల్, తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న సిపిఐ మాజీ ఎంపి సయ్యిద్ అజీజ్‌పాషా

జనరంజకం జూలియస్ సీజర్ నాటకం

చిక్కడపల్లి ఏప్రిల్ 7 (ప్రభాతవార్త) : విఖ్యాత ఆంగ్ల నాటక రచయిత విలియమ్ షేక్స్పియర్ రచించిన ప్రసిద్ధ నాటకం జూలియస్ సీజర్ శ్రీత్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై భక్తి సాహిత్య సాంస్కృతిక అధ్యయన పరిశోధన వ్యవస్థ నిర్వహణలో మంగళవారం రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంయుక్త సహకారంతో ప్రదర్శించారు. జూలియస్ సీజన్ తను నమ్మిన సన్నిహితుడు కుట్ర తో హత్యకు గురి కావటం నాటకంలోని ప్రధాన అంశం. ఈ చారిత్రక నాటకం తెలుగులో ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ దర్శకత్వంలో డాక్టర్ వందన సహ దర్శకత్వం వహించగా ప్రదర్శించారు జూలియస్ సీజర్‌గా ఎనభై పై బడిన వయస్సులోనూ ప్రదీప్‌కుమార్ ఆద్యంతం హుషారు గా నటించారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడు ఇటికాల పురుషోత్తం మాట్లాడుతూ ప్రదీప్ కుమార్ చారిత్రక నాటక ప్రదర్శనలో ప్రతిభా వంతుడు అన్నారు గతం లో ఎన్నో సార్లు భాగ్యనగర చరిత్ర కి సంబంధించిన నాటకం ప్రదర్శించారూ అని గుర్తు చేశారు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు మాట్లాడుతూ డెభై సంవత్సరాలు గా ప్రదీప్ కుమార్ తెలుగు రంగస్థల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారనీ ప్రశంసించారు నాబార్డ్ అసిస్టెంట్ జెనరల్ మేనేజర్ అబ్దుల్ హమీద్ ఖాన్ సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ కళాభిమాని ఉమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎఐతో ఆర్థిక, న్యాయ వ్యవస్థలపై ప్రభావం

అంతర్జాతీయ నిపుణులు గోర్గ్ మోల్ట్

చిక్కడపల్లి, ఏప్రిల్ 7(ప్రభాతవార్త) : సాంకేతికత విప్లవాత్మకంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అందించే అవకాశాలను అందిపుచ్చుకుంటూనే.. దానివల్ల కలిగే చట్టపరమైన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని బిట్‌కాయిన్ సహవ్యవస్థాపకుడు, జర్మనీలోని సతోషి స్కూల్ సీఈఓ గోర్గ్ మోల్ట్ పేర్కొన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ లా కాలేజీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ యుగంలో చట్టం అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. డిజిటల్ కరెన్సీ , ఏఐ కలయిక భవిష్యత్తులో ఆర్థిక, న్యాయ వ్యవస్థలను ప్రభావితం చేస్తుందని, ఈ మార్పులకు అనుగుణంగా న్యాయ విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏఐ నిపుణురాలు ఏంజెలికా మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ద్వారా న్యాయపరమైన పరిశోధనలు వేగవంతం అవుతాయన్నారు. అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ న్యాయ నిపుణుల బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సృజన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐ చట్టంపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. సదస్సులో వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని ఏఐ సవాళ్లపై వక్తలతో ముఖాముఖి చర్చించారు. పాల్గొన్న వారందరికీ ఈ కార్యక్రమం విజ్ఞానదాయకంగా నిలిచిందని విద్యావేత్తలు ప్రశంసించారు.

ప్రపంచాన్ని శాసిస్తోంది యువతరమే : వెంకయ్య నాయుడు

చిక్కడపల్లి ఏప్రిల్ 7 (ప్రభాతవార్త): నేటి ప్రపంచంలో యువత ఆత్మ విశ్వాసం, వినూత్న ఆవిష్కరణలతో ప్రపంచ గమనాన్ని శాసిస్తున్నారని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కొనియాడారు. బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఫిజియోథెరపీ కళాశాల సిల్వర్ జూబ్లీ(రజతోత్సవ) వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు ప్రపంచానికి జ్ఞానాన్ని పంచిన భారత్, ఐక్యత లోపించడం వల్లే విదేశీయుల పాలనలోకి వెళ్ళిందని గుర్తు చేశారు. మళ్లీ దేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టేందుకు ప్రధాని మోదీ వికసిత్ భారత్ 2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని, ఇందులో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డీడీఎంఎస్ అధ్యక్షురాలు ఉషాకొండ మాట్లాడుతూ.. ఆంధ్ర మహిళా సభ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, విద్యా సంస్థల పురోగతిని వివరించారు. ఈ వేడుకలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో డీడీఎంఎస్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఐఏఎస్ రిటైర్డ్ అధికారి ఐ.వి. సుబ్బారావు, దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వై.ఎన్. మూర్తి, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

చిక్కడపల్లి, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త) : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, చేయూత పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి తక్షణమే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. దశరథ్ మాట్లాడుతూ.. హిమాయత్ నగర్ మండలం పరిధిలోని బస్తీల్లో వేలాది మంది పేదలు సొంత ఇంటి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా పేదల గృహ నిర్మాణ సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం కేవలం ఎల్1 కేటగిరీ దరఖాస్తుదారులకే ఇళ్లు మంజూరు చేస్తోందని, దీనివల్ల అద్దె ఇళ్లలో ఉండే వేలాది మంది పేదల కల నెరవేరడం లేదని పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్. వెంకటేష్ మాట్లా డుతూ..వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ప్రకారం చేయూత పెన్షన్ మొత్తాన్ని వెంటనే పెంచి, అర్హులైన వారందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి వర్గ సభ్యులు టి. మహేందర్, జోన్ కమిటీ సభ్యురాలు వెంకటమ్మ, నాయకులు మల్లయ్య, రాజు, వెంకటేష్, నారాయణమ్మ, అనురాధ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 7, ప్రభాతవార్త : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో జరుగుతున్న మహనీయుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సామాజిక సాధికారత వారోత్సవాలలో భాగంగా డా.బి. ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకల సందర్భంగా సాంస్కృతిక, క్రీడా సమ్మేళనాన్ని విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ఆచార్య పుష్పచక్రపాణి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో నిత్యం బిజీ గా ఉండే ఉద్యోగులు క్రీడల్లో పాల్గొంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని తద్వారా పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడమే కాకుండా మానసిక, శారీరకంగా ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉంటుందన్నారు. వారం రోజులపాటు ఉద్యోగులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు బోధనేతర ఉద్యోగుల సంఘ అధ్యక్షులు కాంతం ప్రేమ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య ఆనంద్ పవార్, ఆచార్య వెంకట రమణ, డా.బానోత్ ధర్మ, ఆచార్య కె.కృష్ణారెడ్డి, డా.వై. వెంకటేశ్వర్లు, ఆచార్య శ్రీనివాస్, బోధనేతర ఉద్యోగుల సంఘ సభ్యులు కాంతం ప్రేమ్‌కుమార్, మియా జనీ, పి.విశ్వనాథ్, వై.అశోక్, కె.పాండు, భరత్ రెడ్డి, డాక్టర్ యాకేశ్ దైదా, అన్ని విభాగాల డైరెక్టర్లు, డీన్లు, ఆయా విభాగాధిపతులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రకళా శిబిరం ప్రారంభం

సామాజిక సాధికారత వారోత్సవాలలో భాగంగా విశ్వవిద్యాలయంలో మూడు రోజులపాటు చిత్రకళా శిబిరం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.జి. పుష్ప చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సామాజిక సాధికారక ఉత్సవాల నిర్వహణా ఆవశ్యకతను వివరించారు. కళాకారులు రూపొందించే చిత్రాలు ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కళాఖండాలను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.యల్. విజయ కృష్ణా రెడ్డి వీసీ ఓఎస్డీ ఆచార్య రబింద్రనాథ్‌సోలమన్, ఆచార్య పల్లవీ కాబడే, ఆచార్య ఆనంద్ పవార్, ఆచార్య రజనీ అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఆచార్య పుష్పచక్రపాణి

మంత్రిని కలిసిన మిత్ర కృష్ణ, అరెకటిక సంఘం సభ్యులు

పాత మార్కెట్‌ను తిరిగి ప్రారంభించాలి

కార్వాన్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త) : జియాగూడ స్లాటర్ హౌస్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో పాత మార్కెట్‌ను ప్రభుత్వం మూసివేసింది. ఈ విషయమై ఎస్సీ సెల్ మాజీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ అయిందాల మిత్రకృష్ణ, అరెకటిక సంఘం సభ్యులతోకలసి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి జియాగూడ కమెలా పాత మార్కెట్‌ను మూసివేయడం వల్ల రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున పాత మార్కెట్‌ను తిరిగి ప్రారంభించాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి సమర్పించారు. ఈ సందర్భంగా మిత్ర కృష్ణ మాట్లాడుతూ.. పాత మార్కెట్‌ను మూసివేయడం వల్ల రోజువారీ కూలీలు,చిన్న వ్యాపారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి జీవనోపాధి దెబ్బతినకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి మార్కెట్‌ను తిరిగి ప్రారంభించాలని కోరడం జరిగిందన్నారు. మార్కెట్‌ను ప్రారంభించడం సాధ్యంకాకపోతే, ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి కార్మికులకు ఉపాధి కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసినవారిలో అరెకటిక సంఘం సభ్యులు, కటిక మొందేదార్ కమిటీ సభ్యులు టి.నర్సింగ్ రావు, వినోద్ సభ్యులు పాల్గొన్నారు.

మిద్దె కృష్ణకు దళిత రత్న అవార్డు ప్రదానం

దళిత రత్నాఅవార్డును అందచేస్తున్న ఉత్సవాల చైర్మన్, ప్రతినిధులు

బేగంబజార్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : దళితుల సమస్యల పరిష్కారానికి నిరంతరం రాజీలేని పోరాటంచేస్తున్న ఆరుంధీతి సేవా మండలి అధ్యక్షుడు మిద్దె కృష్ణకు దళితరత్న అవార్డు 2026ను అంబేద్కర్, జగ్జీజీవన్‌రామ్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ సుదర్శన్‌బాబు, బి.మహేందర్, అనిల్ అందచేశారు. ఆరుంధతి సేవమండలి ఉపాధ్యక్షులు దొబ్బలి వెంకటేష్ మాట్లాడుతూ మిద్దే కృష్ణకు దళిత రత్నా అవార్డు రావడం పట్ల 26బస్తీల సంఘాలకు గౌరవం పెరిగిందన్నారు. సంఘం అస్తులు అన్యాకాంతం కాకుండా, రక్షణగా నిలవడంతోపాటు దళితజాతి ఉద్యమకారులకు మిద్దె కృష్ణ తన వంతు సహాయ సహకారాలను అందచేయడం జరుగుతుందన్నారు.

ఎసిటిఓలకు గెజిటెడ్ హోదా కల్పిస్తూ జిఓ జారీ

గన్‌ఫౌండ్రి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వంలో వాణిజ్య పన్నుల శాఖలో విధులను నిర్వహిస్తున్న 537 మందికి గెజిటెడ్ హోదా కల్పిస్తు జి.ఓ 79 జారీ చేయడం పట్ల నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేనీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎసిటిఒలకు గెజిటెడ్ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ, ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.రఘునందన్‌రావు ఆదేశాలు జారీ చేశారన్నారు. పది సంవత్సరాల నుండి ఏసిటిఓ గజిటెడ్ హోదాకు ఎన్నో ప్రయత్నాలు, పోరాటం చేయడం ద్వారా ప్రభుత్వం స్పందించి గజిటెడ్ హోదాను కల్పించినట్లు చెప్పారు. కాగా ఉద్యోగులు కార్యాలయాల వద్ద టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో విక్టర్‌పాల్, ముజీబ్, సుదర్శన్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్, కృష్ణవేణి, వి.వి.ఎన్.మూర్తిచైతన్య, నరేందర్‌రెడ్డి, మహమ్మద్ సలావుద్దీన్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పార్కుగా నెహ్రూనగర్ పార్కు: ఎమ్మెల్యే

అడ్డగుట్ట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: మోండా డివిజన్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని నెహ్రూ నగర్ పార్కులో సకల సౌకర్యాలు మెరుగుపర్చి మోడల్ పార్కుగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం నెహ్రూనగర్ పార్కును సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గత ప్రభుత్వంలో పార్కులకు చేపట్టిన దంగల్ భవనం అర్ధాంతరంగా నిలిచిపోయిందని, దాన్ని తొలగించి ఆ స్థలంలో మంచి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని,ఇండోర్ గేమ్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూనగర్ పార్కును ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ టెంపుల్ చైర్మన్ ప్రభాకర్‌యాదవ్, మోండా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు చిర్రబోయిన సంతోష్‌యాదవ్, సి.వైష్ణవియాదవ్, గుజ నాగేందర్‌యాదవ్, శేఖర్‌ముదిరాజ్, నర్సింగ్ రావ్, పార్కు డెవలప్‌మెంట్ అధ్యక్షుడు హన్మంత్‌రావ్‌యాదవ్, కాలనీ ప్రతినిధులు సుందర్, అజయ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ...

కంటోన్మెంట్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: అడపిల్లల తల్లిదండ్రులకు భారం పడకుండా కళ్యాణలక్ష్మి షాదీముబారక్ పథకం ఎంతో మేలు కలుగుతుందని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సికింద్రాబాద్ మండలానికి చెందిన 26 కుటుంబాలకు మంజూరైన కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను మంగళవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్, నాయకులు సంతోష్‌యాదవ్, రాజేశ్‌యాదవ్, నాగేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

అల్వాల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన శిబిరాన్ని డిసి భోగేశ్వర్ ప్రారంభించారు. బిపి,సుగర్ తదితర పరీక్షలు వైద్యులు నిర్వహించారు. కార్మికులు ఆరోగ్యంపై ప్రభుత్వం పరంగా ప్రత్యేక శ్రద్ధ ఉంటుందని డిసి పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 7, ప్రభాతవార్త : టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి ఇంచార్జ్ బండి రమేష్ నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల విషయమై మంగళవారం సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ సృజనని కలిశారు. పేదలను నివసిస్తున్న బస్తీలతోపాటు మధ్యతరగతి ప్రజల ఆవాసాల్లోను కొన్ని ప్రాంతాల్లో రహదారులు డ్రైనేజీ తాగునీటి వ్యవస్థలు సరిగాలేవని ఆయా ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు. వీటితోపాటు బస్తిలో ఉన్న ఖాళీ స్థలాల్లో కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మించి స్థానిక ప్రజలకు మహిళా సంఘాలకు అందజేయాలని సూచించారు. గతంలో ప్రారంభమై కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని ప్రారంభం కావాల్సి ఉన్న పనులను ప్రారంభించాలని బండిరమేష్ సృజనకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాలి బాలాజీ, లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌తో మాట్లాడుతున్న బండి రమేష్

ప్రజాసమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్

సంజీవరెడ్డినగర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట డివిజన్‌లోని బిజెఆర్‌నగర్, బిజెజెఆర్‌నగర్, బల్కంపేట, ఎస్సార్‌నగర్‌లలో నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఇటీవల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి విన్నవించారు. దీంతో మంగళవారం ఆయన అధికారులతో కలిసి ఆయా ప్రాంతాలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 10 రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడంలేదని, నీటికోసం అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఒకవేళ నీటి సరఫరా చేసినా ప్రెషర్ తక్కువతో వస్తున్నాయని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే తనతోఉన్న వాటర్ వర్క్స్ సీజీఎం ప్రభును సమస్య గురించి ప్రశ్నించగా, బుధవారం నుంచి సక్రమంగా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతానని హెచ్చరించారు. అదే విధంగా బోర్‌వెల్స్ పని చేయడంలేదని, స్పెషల్ డ్రైవ్ చేపట్టి అవసరమైన మరమ్మతులు చేసి వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. బల్కంపేటలో పర్యటించిన సమయంలో స్థానిక కమిటీ హాల్‌కు విద్యుత్ సరఫరా లేదని, రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పట్టించుకునేవారు లేకపోయారని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి వద్దే ఉందని, ప్రత్యేకంగా మున్సిపల్ శాఖకు మంత్రి ఉంటే సమస్యలపై సమీక్షలు చేసేవారని పేర్కొన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్య ఏర్పడకూడదనే ముందు ఆలోచనతోనే రిజర్వాయర్‌ను నిర్మించినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతలను మరిచి ప్రజా సమస్యలను గాలికొదిలిందని విమర్శించారు. సరైన కార్యాచరణ లేకుండా జిహెచ్‌ఎంసిని మూడు కార్పొరేషన్‌లుగా విభజించడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అమీర్‌పేట సర్కిల్ డీసీ సుజాత, డిఈ మహేష్, వాటర్ వర్క్స్ జీఎం సతీష్, శానిటేషన్ డిఈ వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, కట్టా బలరాం, కరుణాకర్‌రెడ్డి, గుడిగే శ్రీనివాస్‌యాదవ్, రాజేష్ ముదిరాజ్, వనం శ్రీనివాస్, నాయకులు పీయూష్ గుప్తా, గౌతమ్, లలితా చౌహన్, గోపీలాల్ చౌహన్, వినోద్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉద్యోగాలకు ముప్పు లేదు

ఒయు వైస్ ఛాన్సలర్ ప్రొ. కుమార్ మొలుగారం

'తరంగ్ 2కె26' ప్రారంభిస్తున్న ప్రొ.కుమార్ మొలుగారం, చిత్రంలో విద్యాసంస్థ చైర్మన్ శ్రీనివాసరావు

హైదరాబాద్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: విద్యార్థులు విద్యా నైపుణ్యాలతోపాటు సృజనాత్మకతను పెంపొందించుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. కుమార్ మొలుగారం అన్నారు. అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల వార్షికోత్సవ వేడుకలు 'తరంగ్ 2కె26' అత్యంత వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు తమలోని బలాలు, బలహీనతలను తెలుసుకునేందుకు ఎస్‌డబ్ల్యూఒటి విశ్లేషణ చేసుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ వల్ల ఉద్యోగాలకు ముప్పులేదని, అది మరిన్ని కొత్త అవకాశాలను సృష్టిస్తుందని భరోసా ఇచ్చారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 35 ఏళ్ల క్రితం కేవలం 9 మంది విద్యార్థులతో ప్రారంభమైన తమ సంస్థ, నేడు 25 వేల మందికిపైగా విద్యార్థులతో వృద్ధి చెందిం దని తెలిపారు. త్వరలో అవంతిని డీమ్డ్ యూని వర్సిటీ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని పేర్కొన్నారు. విశిష్టఅతిథిగా హాజరైన తెలంగాణ ఉన్నత విద్యా మండలి సెక్రటరీ ప్రొ. శ్రీరామ్‌వెంకటేష్, ఎస్బీవీ సీఈఓ వై.రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా నైపుణ్యాలు పెంచుకోవాలని కోరారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అలీముద్దీన్ మాట్లాడుతూ, ఈ ఏడాది 400 మందికిపైగా విద్యార్థులు ప్రముఖ కంపెనీ ల్లో ఉద్యోగాలు సాధించారని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక అంశాలపై నాటికలు అలరించాయి. వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు అతిథుల బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ ఎం. జ్ఞానేశ్వరి, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. ప్రియాంక, ఎండీ ఐ.శ్రావణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఘంటా చక్రపాణి, ఎల్వీకే రెడ్డి

గవర్నర్‌ను కలిసిన అంబేద్కర్ వర్సిటీ వీసీ

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త : గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకేరెడ్డి మర్యాదపూర్వంగా కలిశారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న మహనీయుల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సామాజిక సాధికారత వారోత్సవాల వివరాలను, ఆదివాసీ, ట్రాన్స్‌జెండర్ విద్యార్థులకు అందిస్తున్న ఉచిత విద్య గురించి వివరించారు. ఏప్రిల్ 14న యూనివర్సిటీలో నిర్వహించే అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొని ఆదివాసీ విద్యార్థులకు జ్యోతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే ప్రోత్సాహక ఫెలోషిప్స్ పంపిణీకి హాజరు కావాలని ఆహ్వానించారు.

వేల కుటుంబాలకు జీవనోపాధి ముఖ్యం ఎమ్మెల్యే

కార్వాన్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త): జియాగూడలోని అనధికారిక మేకల వధశాల జీహెచ్‌ఎంసీ వెటర్నరీ అధికారులు మూసివేసిన మేకల వధశాల ఎట్టకేలకు పునః ప్రారంభమైనది.కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ చొరువతీసుకొని,సీఎల్ వేసిన జియాగూడ కబేళా తలుపులు తీశారు.జియాగూడ కబేళాపై జీవనోపాధిని ఏర్పరచుకొని ఎన్నో ఏండ్లుగా వృత్తి ఆధారపడిన అరెకటికలు, గొల్లకురుమలు, యాదవులు, జమైతుల్ ఖురేషీలు,దళిత తదితర వర్గాలకు చెందిన సుమారు 4 వేల కుటుంబాలక జీవనోపాధి దొరుకుతుందని,వారి జీవనాధారం కోల్పోకూడదని అన్నారు.

సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదు

స్వచ్ఛ సనాతన వేదిక హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 7,ప్రభాతవార్త:

సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదని స్వచ్ఛ సనాతన వేదిక నాయకులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శివ శక్తి అధ్యక్షులు కరుణాకర్ సుగ్గున,హిందూ జనశక్తి అధ్యక్షులు లలిత్ కుమార్, భారతవర్ష అధ్యక్షులు దువ్వాడ శివ ప్రసాద్, హైందవి స్వరాజ్ అధ్యక్షులు భాస్కర్ కిల్లీ తదితరులు హాజరై మాట్లాడారు.. గత కొద్ది రోజులుగా షిరిడీ సాయి బాబా అంశంపై హిందూ సంఘాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, తెలంగాణ, మహారాష్ట్రలో అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు.

కోర్టుల చుట్టూ తిప్పుతామని, 50 కోట్ల రూపాయల వరకు పరువు నష్టం దావా వేస్తామని బెదిరించడం రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని అణిచివేయడమేనని అన్నారు. సాయి భక్తుల పేరుతో కొందరు వ్యక్తులు చేస్తున్న అచారాలు, ప్రచారాలు సనాతన ధర్మానికి తీరని నష్టం కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాయి బాబా ముస్లిం అని, ఆయన దత్తాత్రేయ అవతారం కాదని, సనాతన ధర్మం ప్రకారం ఆయన దేవుడు లేదా గురువు కూడా కాదని తమ అభిప్రాయాన్ని తెలిపారు.

మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో హిందూ సంఘాల నాయకుల ఫోటోలతో కూడిన పోస్టర్లు వేసి, వారిని భౌతికంగా దెబ్బతీస్తామని, అవసరమైతే హత్య చేస్తామని షిరిడీ సాయి సంస్థానం ప్రతినిధులు బహిరంగంగా బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. తాము అడిగిన ప్రశ్నలలో తప్పులు ఉంటే ఆధారాలతో నిరూపించాలని, అప్పుడు తాము నిజాన్ని అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కేవలం భక్తి ముసుగులో అమాయక హిందువులను ధర్మానికి దూరం చేయడం సరికాదన్నారు.సనాతన ధర్మాన్ని, దేవీ దేవతలను, పుణ్యక్షేత్రాలను అవమానించేలా చేస్తున్న ప్రచారాలను ప్రతి హిందువు గమనించాలని కోరారు. స్వచ్ఛమైన సనాతన ధర్మాన్ని భవిష్యత్తు తరాలకు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు

ఉద్యమకారుడు హరిసింగ్ ఠాకూర్ మృతి

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త) :

దేశంలోని వామపక్ష, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత కోసం జీవితాంతం కృషి చేసిన ప్రముఖ ఉద్యమకారుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు హరిసింగ్‌ఠాకూర్(90) బాగ్‌లింగంపల్లి సూర్యనగర్ నివాసంలో కన్ను మూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. దిద్ది సుధాకర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ప్రముఖ కమ్యూనిస్టు నేతలు బ్రిజ్ రాణిగౌర్, రాజ్ బహదూర్ గౌర్ దంపతుల సంతానమైన హరిసింగ్ ఠాకూర్ చిన్న వయసులోనే ఉద్యమబాటపట్టారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్‌గా పనిచేసి తన నిబద్ధతను చాటుకున్నారు. బ్యాంకు ఉద్యోగం లభించినప్పటికీ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, వామపక్ష రాజ కీయాల పట్ల మక్కువతో ఆ ఉద్యోగాన్ని వదిలి పూర్తిస్థాయి ప్రజా జీవితాన్ని ఎంచుకున్న అరుదైన వ్యక్తి అని డా. సుధాకర్ కొనియాడారు. "కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలి" అనే నినాదమే ఆయన జీవితాంతం ప్రతిధ్వనించిందని సుధాకర్ పేర్కొ న్నారు.దేశంలో ప్రస్తుతం పెరుగుతున్న మతోన్మాదం, రాజ్యాంగ విలువలపై దాడులను ఎదుర్కోవాలంటే వామపక్ష, లౌకిక శక్తుల కలయికే ఏకైక మార్గమని ఆయన చివరి వరకు హెచ్చరిస్తూ వచ్చారని గుర్తు చేశారు. కేవలం కార్యకర్తగానే కాకుండా, నాయకులందరినీ సమన్వయం చేస్తూ ఐక్యత కోసం ప్రతి వేదికను ఉపయోగించుకున్న నిజమైన పోరాట యోధుడు హరి సింగ్ అని కొనియాడారు. హరి సింగ్ ఠాకూర్ మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని, ఆయన ఆశయ సాధన కోసం వామపక్షాలు ఐక్యం కావడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని సుధాకర్ పిలుపునిచ్చారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సంతాప కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ నేత వెంకటస్వామి గౌడ్, ఆప్ నాయకులు రాకేష్ సింగ్, సురేందర్, సతీష్ పాల్గొని నివాళులర్పించారు.

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌నజన్మదిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్

ప్రజా శ్రేయస్సుకోసం పరితపించే నేత పజ్జన్న

అడ్డగుట్ట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆయురారోగ్యాలతో ఉంటూ ప్రజా శ్రేయస్సుకు పాటుపడాలని అడ్డగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్నశ్రీనివాస్ అన్నారు. మంగళవారం అడ్డగుట్ట, లింగాని ప్రసన్నశ్రీనివాస్ ఆధ్వర్యంలో మహేంద్రహిల్స్‌లోని శ్రీవిద్యాసెంటర్‌లో పద్మారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పద్మారావుకు విడియోకాల్ ద్వారా లింగాని ప్రసన్న, బిఆర్ఎస్‌నాయకులు, శ్రీవిద్యా సెంటర్‌లోని విద్యార్థులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ సికింద్రాబాద్ అసెంబ్లీ సమన్వయకర్త రాజు, సుందర్, నాయకులు లింగాని శ్రీనివాస్,నక్క మధు, మనోహర్, సత్తయ్యగౌడ్, వసంత, వడ్డెర ఎల్లయ్య, గడ్డం మల్లేష్, దాసరి శ్రీనివాస్, శంకర్, భాస్కర్, గోపి,రమేష్, సత్యనారాయణ, వసంత, దేవయ్య, వరలక్ష్మి, మహేశ్వరీ పాల్గొన్నారు. అనంతరం భోజనాలను ఏర్పాటు చేశారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి: బద్దం సతీష్‌గౌడ్

బేగంబజార్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్ మహానగర పాలక సంస్థ సర్కిల్-30 డిప్యూటి కమిషనర్ ఉమాప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. గోషామహల్ నియోజకవర్గంలో దోమలు పెరిగి రాత్రి వేళ్లలో ప్రజలను తీవ్ర ఇబ్బందుకుల గురిచేస్తున్నట్లు ఆమెకు వివరించారు. ముఖ్యంగా మూసినది ప్రవాహక ప్రాంతంలో దోమలు పెరిగిపోయాయన్నారు. పెరిగిన దోమల బెడదతో ప్రజలకు కంటి మీద కునుకు కరువైందన్నారు.దోమల నివారణ కు చర్యలు తీసుకోవాలని డిప్యూటి కమీషనర్ ఉమా ప్రకాష్‌ను కోరారు.

టిపిటి ఛార్జీలను తగ్గించాలి : వికాస్ మంచ్

కంటోన్మెంట్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో టీపిటీ ఛార్జీలు 5 శాతం నుంచి 1.5 శాతంకు తగ్గించాలని వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవింద్ డిమాండ్ చేశారు. మహేంద్రహిల్స్‌లో ఆయన మాట్లాడుతూ 1989 కంటోన్మెంట్ చట్టం 1924 ప్రకారం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా 5 శాతం టీపిటీ రేట్ నిర్ణయించడం జరిగిందన్నారు. అయితే గతంలో ప్రజల్లో అవగాహన, సమాచార, కమ్యూనికేషన్ సౌకర్యాలు లేకపోవడంతో స్థానికులు అభ్యంతరాలు తెలపలేదన్నారు. కంటోన్మెంట్ బోర్డు ప్రాంతం చుట్టూ ఉన్న గ్రేటర్‌లో 1.5శాతం టీపిటీ ఉందన్నారు. అదే పద్ధతిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

అల్వాల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: మచ్చబొల్లారం హిందూ శ్మశాన వాటికను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వస్తామని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. మంగళవారం మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్, సర్కిల్ డిసి భోగేశ్వర్ ఇతర అధికార యంత్రాంగంతో కలిసి మైనంపల్లి అభివృద్ధి పనులను పరిశీలించారు. సుమారు 4 కోట్లు వ్యయంతో జిహెచ్‌ఎంసి అభివృద్ధి పనులు చేపట్టింది. ప్రజలకు అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వం కల్పించడం జరుగుతుందని మైనంపల్లి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నేతలు అధికారులు పాల్గొన్నారు.

బిజెపి కార్యవర్గ సభ్యులకు సన్మానం

అల్వాల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన వారికి మంగళవారం ఘన సన్మానం జరిగింది. ఇటీవల పార్టీ కార్యవర్గ సభ్యులుగా పరాంకుశం మాధవ్, చింతల మాణిక్య రెడ్డి, శ్రీనివాస్ వర్మ, గోపు రమణా రెడ్డిలు పార్టీ ఎంపిక చేసింది. అల్వాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ పటిష్టత, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం శ్రేణులు శ్రమించాలని వారు పిలుపు ఇచ్చారు.

శానిటేషన్ సిబ్బందికి హెల్త్ క్యాంప్

దుండిగల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త : 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దుండిగల్‌సర్కిల్‌లో శానిటేషన్ సిబ్బందికి మంగళవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ పర్యవేక్షించారు. దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ హెల్త్‌క్యాంప్‌లో శానిటేషన్ సిబ్బంది, ఇతర ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వర్ణలత, దుండిగల్ సర్కిల్ ఏఎంఒహెచ్ డాక్టర్ విజయ మోహన్ రావు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్, హాస్పిటల్ ఇన్‌చార్జ్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సికింద్రాబాద్ జోన్

NIT No. టెండర్ నోటీసు నెం.1/EE-II/Cir-44/SBZ/GHMC/2026-27, తేది: 06.04.2026.
పని పేరు : సివిల్ పనులు: 7నం. విద్యుత్ పనులు: 2 నం. అంచనా మొత్తం (రూ.లక్షలలో) : 70.15. బిడ్ దాఖలుకు ప్రారంభ/ముగింపు తేదీ మరియు సమయం : 08.04.2026, మ.2.30గం., మరియు 13.04.2026 మ.2.30గం. అధికారి పేరు మరియు చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-44, మెట్టుగూడ 7989990947. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-44, SBZ, GHMC.
DIPR.NO.264-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 07.04.2026

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ Hi, I am adding My Father Surname KUMAR to my current name AMAYRA. Hence, my name changes from AMAYRA to AMAYRA KUMAR as per document.
(Ro.No.759)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT MEDCHAL
O.S. No. [illegible] OF 2026
Between:
[illegible] ... Plaintiffs
And
1. The Tahsildar, [illegible]
2. All Concerned ... Defendants
To
All Concerned.
Please take notice that the above named Plaintiffs filed the above said suit for declaration to declare them as a legal heirs of Late R. [illegible] [illegible] 15-04-2026 for your appearance as such any person of persons having any claim or objection in this regard may appear before the above said Hon'ble court on 15-04-2026 at 10:30 A.M. either in person or through advocate failing which the matter will be heard and disposed off as per law.
(BY THE ORDER OF THE COURT)
Sd/- [illegible] RAMA KRISHNA, [illegible]
Advocate
[illegible] Ram Reddy Nagar, Quthbullapur Municipal Circle and Mandal, GHMC, Medchal-Malkajgiri District.
Cell No. [illegible] 9440168144

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD
O.S. No. 735 of 2026
Between:
Sri. Gopal Kumar Agarwal & others ... Plaintiffs
And
To all concerned & another ... Defendants
To,
All Concerned
NOTICE
Please take notice that the above named Plaintiffs have filed the above suit to Declare the Plaintiffs as Legal Heirs of Late Sri. Jagdish Prasad Agarwal & Late Smt. Vimala Bai, and the same is posted on 20-04-2026. That if any persons has got any kind of objection in the above matter may appear before the Hon'ble Court on 20-04-2026 at 10:30 A.M. either personally or through an Advocate, failing the same, will be decided on the material available.
By the Order of the Court
Pawan Kumar Agarwal
Advocate
[illegible] RATNA TOWERS, CHIRAG ALI LANE, ABIDS, HYDERABAD-1.
Phone: [illegible]
Counsel for the Plaintiffs

బహిరంగ ప్రకటన
[illegible]

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

పనులను పరిశీలిస్తున్న ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్‌కాలనీ రోడ్‌నెంబర్ 3లో సీసీ రోడ్డు పనులను మంగళవారం అధికారులు కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రోడ్డు నిర్మాణం పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్, ఏఈ ప్రశాంతి, కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి, సుబ్బారావు, రాజు, మధుసూదన్, మహిపాల్‌రెడ్డి, సోమరాజు పాల్గొన్నారు.

జన జాగరణ జాతరకు సారయ్య మద్దతు

సారయ్యకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న బ్రహ్మయ్య

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరగబోయే బీసీ జన జాగరణ జాతర కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెదవుర బ్రహ్మయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యను కలిసిన బ్రహ్మయ్య ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ఏప్రిల్ 19 ఆదివారం మధ్యాహ్నం 2లకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే జన జాగరణ జాతర కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు మద్దతు కావాలని ఎమ్మెల్సీకి విజ్ఞప్తి చేశారు. జన జాగరణ జాతర కార్యక్రమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపాడు. బీసీల ఐకమత్యం తోనే రాజ్యాధికారం సాధ్యం అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోరంగి దుర్గారాణి, సామపృథ్వీరాజ్ పాల్గొన్నారు.

గ్రీన్‌పార్క్ కాలనీలో ఘనంగా శ్రీవారి తిరుకళ్యాణ మహోత్సవం

పూజలు నిర్వహిస్తున్న ఎంపి ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సైదాబాద్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్క్ కాలనీలోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం 18వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీవారి తిరుకళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. శ్రీవారి తిరుకళ్యాణ మహోత్సవంలో మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్, ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా 8వ తేదీ బుధవారం ఉదయం రధాంగ హోమము, సాయంత్రం రథోత్సవము, తిరువీధి సేవ నిర్వహించనున్నారు. ఈ నెల 4వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 9వ తేదీతో ముగుస్తాయి. ఈ కార్యక్రమంలో గ్రీన్‌పార్క్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొంగర జగన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొంతం మహిపాల్‌రెడ్డి, దేవాలయ ఛైర్మన్ పులకంటి వెంకట్‌రెడ్డి, కోశాధికారి మద్ది రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నారాయణ రెడ్డి, చంద్రగుప్తా, సంయుక్త కార్యదర్శులు అంజయ్య గౌడ్, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : మాజీ కార్పొరేటర్

రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. తిరుమల హిల్స్ నుండి కరణ్‌బాగ్‌లోని మల్లన్న స్వామి దేవాలయం వరకు నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డును స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తకాపు అరుణ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హోమియో వైద్య కళాశాలలో హోమియో వాక్

ప్రభుత్వ హోమియో వైద్య కళాశాలలో ఆధ్వర్యంలో హోమియో వాక్ నిర్వహిస్తున్న డా. లింగరాజు తదితరులు

రామంతాపూర్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : ప్రపంచ హోమియో దినోత్సవ సన్నాహక ఉత్సవాలలో భాగంగా మంగళవారం ప్రభుత్వ హోమియో వైద్య కళాశాలలో ఆధ్వర్యంలో హోమియో వాక్ నిర్వహించారు. హోమియోపతి కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డైరెక్టర్ డా. లింగరాజు ఈ వాక్ ను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువ హోమియో వైద్యులు అంకిత భావంతో జాతికి హోమియో వైద్యం ద్వారా పునరంకితం కావాలని పిలుపు నిచ్చారు. గత వారం రోజులుగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డా. దాసరి పార్థసారదిజ, వైస్ ప్రిన్సిపాల్ డా. రాజేశ్వర్ రావు, డా. కృష్ణమూర్తి, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పల్ ముదిరాజ్ సంఘ భవనానికి రూ.62లక్షల నిధులు

అభివృద్ధి పనులు పరిశీలించిన మందముల పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్ ముదిరాజ్ సంఘం భవనం పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : ఉప్పల్ ముదిరాజ్ సంఘం భవనం పనుల కోసం రూ.62లక్షల నిధులు మంజూరు చేయించినట్లు మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం భవనం అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్‌లోని ముదిరాజ్ సంఘం భవనానికి మహర్దశ పట్టనుందని, సంఘ భవనం కోసం రూ.62 లక్షల నిధులను మంజూరు చేయించినట్టుగా ఎం.పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాలనీలలో కమ్యూనిటీహాళ్లను, కుల సంఘాల భవనాలను పూర్తి స్థాయిలో నిర్మాణాలను చేయిస్తున్నట్టుగా చెప్పారు. ఇదే కాకుండా గతంలో మిగిలిన పెండింగ్ పనులను సైతం పూర్తి చేయిస్తున్నట్టుగా తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులను తెప్పించి ఉప్పల్ ముదిరాజ్ సంఘ భవనాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేలా చూస్తామన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.కోట్ల నిధులను తెచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి పాల్పడుతున్నట్టుగా తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అన్ని రకాల పనులను చేపడుతూ ఉప్పల్ ప్రాంతాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్నట్టుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బోరంపేట రమేష్, మహంకాళి కృష్ణ, ఈగ లక్ష్మణ్, ఈగ ఈశ్వరయ్య, పిట్టల సాయిలు, గంగాదేవి కరుణాకర్, ఈగ బాబు, మంద శేఖర్, బోరంపేట రాము, తలారి వినయ్, కావలి రాము ,రంగుల శేఖర్, అరటికాయల మల్లేష్, కంచె మీది రవీందర్ ముదిరాజ్, కంచెమీది శివయ్య ,కోకొండ జగన్, రాపాక నర్సింగ్, ఈగ మురళి, కాయల శీను, మహంకాళి వేణు, మహంకాళి రాజు, కావలి హరి, ఈగ రాజేష్, బోరంపేట రవి, తలారి జహంగీర్, కస్తూరి లక్ష్మణ్, దాడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో అవినీతి వెనుక ఉన్న సూత్రధారులెవరో బహిర్గతం చేయండి

సస్పెండ్ అయిన అధికారులను డిమాండ్ చేసిన బిజెపి

బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బిజెపి నాయకులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: బడంగ్‌పేట్‌లో జరిగిన కోట్లాది రూపాయల అవినీతి, అక్రమాల భాగోతంలో సస్పెండ్ అయిన అధికారులు దాని వెనుక ఉన్న అసలు సూత్రధారులెవరో బహిర్గతం చేయాలని క్లస్టర్ బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డితో పాటు పలువురు నాయకులు డిమాండ్ చేశారు. భారీ అవినీతికి పాల్పడిన వారిలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టకూడదనీ అసలు సూత్రధారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రజా ధనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు బిజెపి మాజీ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు సర్కిల్ ఆఫీస్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి తదితరులు మాట్లాడుతూ బడంగ్‌పేట్‌లో జరిగిన దాదాపు 150 కోట్ల అవినీతి వ్యవహారం.. డిప్యూటీ కమీషనర్ సరస్వతితో సహా మొత్తం పది మంది అధికారుల సస్పెండ్ రాష్ట్రాన్ని కుదుపేసిందని అన్నారు. ఇక్కడి అవినీతి, అక్రమాల విషయంలో ఒక్క అధికారులే కాకుండా వెనుక బడా నేతలు ఉన్నారని తెలిపారు. సస్పెండ్ అయిన అధికారులు నోరు విప్పి వాస్తవాలను బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు. అవినీతి వెనుక కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నేతలు ఉన్నారనీ అయితే దానిని కప్పి పుచ్చుకోవడానికి ఆ పార్టీల నేతలు బిజెపిపై ఏవేవో ఆరోపణలు చేస్తున్నారని వారు తెలిపారు. అవినీతిలో బిజెపి మాజీ కార్పొరేటర్లు ఉన్నారనీ వారు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. నగర పంచాయతీ ఏర్పడినప్పటి నుండి బిజెపి అవినీతిపై పోరాటం చేస్తూనే ఉందని వారు స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ పరిధిలో కాంట్రాక్టర్లు పనులు చేయకుండా కోట్లు దోచుకున్నారనీ బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులు చేసి రూ.40 లక్షలు మింగేశారని వారు ఆరోపించారు. బిజెపి చేసిన పోరాటాలు, ఇచ్చిన ఫిర్యాదుల కారణంగా బడంగ్‌పేట్‌లో అవినీతి బయట పడిందనీ లేకుంటే ఇంకా సాగేదని వారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బడంగ్‌పేట్ అవినీతిపై సిట్ ఏర్పాటు చేసి విచారణ చేయించాలనీ బాధ్యులైన రాజకీయ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి స్వాహా చేసిన డబ్బులను రికవరీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్, పార్టీ సీనియర్ నాయకులు సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, నడికుడ యాదగిరి, జక్కిడి మధుసూదన్‌రెడ్డి, క్లస్టర్ -2 అధ్యక్షుడు రామిడి వీరకర్ణారెడ్డి, మీర్‌పేట్ క్లస్టర్ అధ్యక్షుడు పసునూరి బిక్షపతిచా, నాయకులు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెత్తుల్ల పుల్లారెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, పాలుబాయి లక్ష్మణ్, మర్రి అంజిరెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, రేసు నర్సింహారెడ్డి, కొంతం ప్రకాశ్‌రెడ్డి, రాత్లావత్ నీలా రవినాయక్, కళ్లెం మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫోర్ ఫాదర్ హోటల్ నిబంధనల ఉల్లంఘనల ఆరోపణలు

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై చర్యలేవీ లేవా?
నిర్లక్ష్య ధోరణిలో మల్కాజిగిరి ట్రాఫిక్ అధికారులు
ఫుట్ పాత్ ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్న మోలాలి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: నేరేడ్‌మెట్ పరిధిలోని డిఫెన్స్ కాలనీ ఫిఫ్త్ అవెన్యూ బేకరీ ప్రధాన రహదారి పరిసరాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, అనుమతుల ఉల్లంఘనలపై స్థానికుల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఫోర్ ఫాదర్ హోటల్ పరిసరాల్లో ఏర్పడిన పరిస్థితులు పాదచారుల భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని వారు చెబుతున్నారు .పార్కింగ్ సౌకర్యం సరిపడా లేకుండానే కమర్షియల్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హోటల్‌కు వచ్చే వాహనాలు ఫుట్‌పాత్‌లపైనే నిలిపివేయబడటంతో, పాదచారులు రహదారిపై నడవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ఫిఫ్త్ అవెన్యూ బేకరీ నుండి వాయుపురి మార్గం గుండా సైనిక్‌పురి సిగ్నల్ వరకు ఫుట్‌పాత్‌లు అనేక చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాల కోసం ఫుట్‌పాత్‌లను వినియోగించడం వల్ల ట్రాఫిక్ రద్దీ మరింత పెరుగుతోంది. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలు తీవ్రంగా మందగించి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నియమ నిబంధనల అమలులో లోపాలు ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలుమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, తగిన చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఫుట్‌పాత్‌లు పాదచారుల హక్కు అనే భావన క్రమంగా కనుమరుగవుతున్న నేపథ్యంలో, టౌన్ ప్లానింగ్ మరియు ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఆక్రమణలను తొలగించడం, పార్కింగ్ వ్యవస్థను క్రమబద్ధీకరించడం అత్యవసరమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల అభ్యర్థనల మేరకు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. మల్కాజ్గిరి ట్రాఫిక్ అధికారులు అదేవిధంగా మోలాలి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రజారక్షణకు కారకులు కావాలని స్థానికులు కోరుతున్నారు.

జిహెచ్‌ఎంసి పార్క్ పక్కన సెల్ టవర్ నిర్మాణం.. కాలనీవాసుల ఆందోళన



చర్లపల్లి ఈసీ నగర్ సెల్ టవర్ నుంచి ప్రణయ్ కుమార్ ను కిందికి దించిన చర్లపల్లి పోలీసులు ఫైల్ ఫోటో

కుషాయిగూడ, ఏప్రిల్ 7 , ప్రభాతవార్త, మేడ్చల్ జిల్లా చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఈసీ నగర్ కాలనీలో జిహెచ్‌ఎంసి పార్కు పక్కనే అక్రమంగా సెల్ టవర్ నిర్మాణం జరగడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు దిగారు. కాలనీవాసులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కాలనీకి చెందిన ప్రణయ్ కుమార్ అనే యువకుడు సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. సమాచారం అందుకున్న చర్లపల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని యువకుడిని కిందికి దించేందుకు ప్రయత్నించినప్పటికీ, అతను టవర్‌పైనే ఉండి నిరసన కొనసాగించాడు. కాలనీవాసులు ఆరోపిస్తూ.. కాలనీ అధ్యక్షుడు బూడిద శ్రవణ్ కుమార్ గౌడ్, ఇతర నాయకులు ఆనంద్ రాజు, సత్తిరెడ్డి సెల్ టవర్ యజమానితో కుమ్మక్కై గత పది రోజులుగా రహస్యంగా నిర్మాణం కొనసాగించారని మండిపడ్డారు. అలాగే టవర్ సమీపంలో అనారోగ్యాలతో బాధపడుతున్నారని వీటినేమీ లెక్కచేయకుండా కాలనీ నాయకులుగా కెలాం అవుతున్న కొందరు ఏకపక్ష నిర్ణయం తీసుకొని కాలనీ ప్రజల ఆరోగ్యాలను పట్టించుకోకుండా షెల్ టవర్ యజమానికే వంట పడుతున్నారని ఆరోపించారు షెల్ టవర్లను నివాసాల మధ్య నిర్మించడం మంచి పద్ధతి కాదన్నారు డయాలసిస్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నారని, ఇది వారి ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సెల్ టవర్‌ను పూర్తిగా తొలగించేంతవరకు తమ ఆందోళనను విరమించబోమని కాలనీవాసులు స్పష్టం చేశారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఈసీ నగర్ కాలనీకి చెందిన ప్రణయ్ కుమార్ అనే యువకుడు మూడు గంటల పాటు హైడ్రామా కొనసాగించారు అని పోలీసులకు చెప్పడంతో ఏమి చేయాలో పోలీసులకు అర్థం కాలేదు సమస్యకు షెల్ టవర్ కు పరిష్కారం చొరవ చూపుతామని పోలీసులు హామీ ఇవ్వడంతో కాలనీ ప్రజలు ప్రణయ్ కుమార్ ను ఒప్పించి మెల్లగా సెల్ టవర్ పైనుంచి కిందికి దిగాడు దీంతో కాలనీ ప్రజలంతా ఊపిరి పీచుకున్నారు షెల్ టవర్ ను ఈసీ నగర్ కాలనీ నుండి ఎత్తివేసేంతవరకు ఆందోళన కార్యక్రమాలను విరవించబోమని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు

మూసారాంబాగ్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

మలక్ పేట ఏప్రిల్ 7, ప్రభాతవార్త: మూసారాంబాగ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ సిటీ2 విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఇన్ స్పెక్టర్లు సురేందర్ రెడ్డి, రవీందర్, గణేష్, కరుణాకర్ రెడ్డిలు సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టింది. సబ్ రిజిస్ట్రేషన్‌కార్యాలయంలో జరుగుతున్న పనితీరు, పత్రాల పరిశీలన తదితర అంశాల గురించి పరిశీలించి అధికారులు రికార్డులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ శీకా గోయాల్ ఆదేశాల మేరకు అజంపుర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించడం జరిగిందని వివరించారు. కార్యాలయంలో పారదర్శకంగా పని తీరు జరుగుతుందా లేదా అనే అంశాలను పరిశీలించడంతోపాటు ప్రజలకు ఏమైనా ఇబ్బంది కలుగుతుందా అనే విషయాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. కార్యాలయంలో విధి నిర్వహణకు విచ్చేసే అధికారులు, సిబ్బంది తమతో పాటు వెంట తెచ్చుకున్న నగదు వివరాలను రికార్డులలో నమోదు చేయాల్సి ఉండగా కొంతమంది తమ వద్ద ఉన్న నగదు గురించి రికార్డులలో నమోదు చేయలేదని, మిగత అధికారులు, సిబ్బంది తమ వద్ద ఉన్న నగదు గురించి రికార్డులలో నమోదు చేయడం జరిగిందని వివరించారు.

హెచ్‌ఎంటి నగర్ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి ప్రశంసనీయం

సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్

నాచారం, ఏప్రిల్ 7: హెచ్‌ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన పాలకమండలి సభ్యులు మంగళవారం ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూడా నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎంటి నగర్ చెరువు సుందరీకరణకు రూ.30 కోట్లతో ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పాటు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.1.10 కోట్లు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యేకు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి. బుచ్చయ్య, ఉపాధ్యక్షుడు ఆర్. యాదగిరి రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. రామకోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కె. శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి. సమ్రాట్, ఖజాంచి జి. రామారావు, కార్యవర్గ సభ్యులు వి. బాల్ రెడ్డి, పి. నరసింహ రెడ్డి, బి.హెచ్. నారాయణ బాబు, ఎండీ యూసుఫ్, సతీష్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు. అలాగే బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ హాజరయ్యారు.

100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న తహసిల్దార్ ఫూల్ సింగ్

నాచారం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : ఉప్పల్ నియోజకవర్గంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంజూరైన నేపథ్యంలో, ఆసుపత్రి నిర్మాణానికి అనుకూలమైన స్థలాల పరిశీలన కొనసాగుతోంది. ఈ క్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచన మేరకు మంగళవారం మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ సమీపంలోని సర్వే నంబర్ 84లో ఖాళీగా ఉన్న స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఉప్పల్ మండల తహసిల్దార్ ఫూల్ సింగ్, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ఈ స్థలాన్ని పరిశీలించి, ఆసుపత్రి నిర్మాణానికి ఇది అనుకూలంగా ఉండటంతో పాటు అవసరాలకు సరిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం వేణుగోపాల్, మేనేజర్ రోహిత్, రెవిన్యూ అధికారులు, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, తిగుళ్ల శ్రీనివాస్ గౌడ్, ఫైళ్ల ప్రవీణ్, అల్లాడి కృష్ణ యాదవ్, పద్మారెడ్డి, ఉస్మాన్, రఘు పాల్గొన్నారు.

సబితా ఇంద్రారెడ్డి పిఎ శ్రీనివాస్‌కు మాతృ వియోగం

సరూర్‌నగర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పిఎ) శ్రీనివాస్‌కి మాతృవియోగం కలిగింది. ఇబ్రహీంపట్నంలో నివాసం ఉంటున్న ఆయన తల్లి ఇందుకూరి అచియమ్మ సోమవారం మధ్యాహ్నం గుండె నొప్పితో మృతి చెందారు. ఈ నేపథ్యంలో సమాచారం తెలిసిన వెంటనే సబితా ఇంద్రారెడ్డి ఇబ్రహీంపట్నంకు తరలివెళ్ళి అక్కడ శ్రీనివాస్ మాతృమూర్తి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మాతృవియోగం ఉన్న పిఎను పరామర్శించారు. సబితా ఇంద్రారెడ్డితో పాటు భువనగిరి పార్లమెంట్ బిఆర్‌ఎస్ ఇంఛార్జి క్యామ మల్లేష్ తదితరులు కూడా శ్రీనివాస్‌ను పరామర్శించారు. మంగళవారం జరిగిన అంత్యక్రియలకు మహేశ్వరం నియోజకవర్గం నుండి పలువురు బిఆర్‌ఎస్ నాయకులు ఇబ్రహీంపట్నం వెళ్ళి అక్కడ శ్రీనివాస్‌ను పరామర్శించారు.

మూసి ప్రజలు ధైర్యంగా ఉండండి అండగా ఉంటాం

చాదర్ ఘాట్, శంకర్ నగర్ మూసి పరివాహక ప్రాంతంలో పర్యటిస్తున్న బిఆర్‌ఎస్వీ సీనియర్ నాయకులు పగిళ్ల నర్సింగ్, బాబు సుదర్శన్ తదితరులు

మలక్ పేట, మార్చ్ 7, ప్రభాతవార్త: మూసీ ప్రజలు ధైర్యంగా ఉండండి అండగా ఉంటామని బిఆర్‌ఎస్వీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు పగిళ్ల నర్సింగ్ పేర్కొన్నారు. బిఆర్‌ఎస్వీ పోరు బాటలో భాగంగా నాల్గవరోజు మలక్ పేట్ నియోజకవర్గం లోని చాదర్ ఘాట్, శంకర్ నగర్ బస్తీలలో పగిళ్ల నర్సింగ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించి పేదలకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా పగిళ్ల నర్సింగ్ మాట్లాడుతూ మూసీ పరివాహక ప్రాంత ప్రజలు అధైర్య పడద్దని బిఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని, కేసీఆర్ తోడుగా ఉంటారని, బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా ఉంటారని పేదలకు భరోసానిచ్చారు. మూసీ పేరుతో రేవంత్ సర్కార్ లక్షన్నర కోట్ల స్కాం కు వ్యతిరేకంగా బిఆర్‌ఎస్వీ పోరుబాట కార్యక్రమాని నిర్వహిస్తున్నామని తెలిపారు. మూసి బ్యూటిఫికేషన్ పేరిట లక్షలాదిమందిని నిరాశ్రయులను చేయడం న్యాయమా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయంలో మూసి పునరుజ్జీవం దిశగా పడిన అడుగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టి, ఫక్తు రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా మార్చిందికమిషన్ల కోసమే అని ఆరోపించారు. మూసి ప్రాజెక్టు పై కాంగ్రెస్ కుట్ర ను ఎండగడుతామనీ, రేవంత్ సర్కార్ దోపిడిని అడ్డుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిఆర్‌ఎస్ నాయకులు బాబు సుదర్శన్, బిఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల సతీష్, నాయకులు రాజేష్ నాయక్, కమల్, విశాల్, కిషోర్, నరేష్ పాల్గొన్నారు.

నేరేడ్ మెట్‌లో తల్లి-కూతురు అదృశ్యం..

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 7:ప్రభాతవార్త. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి తల్లి కూతుర్లు వెళ్లిపోయిన సంఘటన నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, దేవీనగర్‌కు చెందిన జి. రెనిత (26) తన నాలుగేళ్ల కుమార్తె మెర్లిన్‌తో కలిసి ఏప్రిల్ 3న ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు సమాచారం. భర్త పంజన్‌తో జరిగిన వాగ్వాదం అనంతరం ఆమె ఇంటిని విడిచి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ ఘటనపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తల్లి-కూతురి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇటువంటి ఘటనల నేపథ్యంలో కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమాచారం తెలిసినా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు పేర్కొన్నారు.

పెండింగ్ అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలి: ఎమ్మెల్యే బలాల

జిహెచ్‌ఎంసి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్ పేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త: పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మంగళవారం జిహెచ్‌ఎంసి అధికారులతో ఎమ్మెల్యే బలాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ మలక్ పేట నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను తరితగతినపూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా నూతన అభివృద్ధి పనులను చేపట్టడానికి వెంటనే ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి అధికారులు వేణుగోపాల్, వెంకన్న, మాజీ కార్పొరేటర్ సలాం షాహిద్, మినాజ్, నాయకులు అబ్రార్ పాల్గొన్నారు.

సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నేతల పాలాభిషేకం

హబ్సిగూడలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

ఉప్పల్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త : సిఆర్ఎంపి కింద హబ్సిగూడకు రూ. 21 కోట్ల 60 లక్షలు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ హబ్సిగూడ డివిజన్ కమిటి ఆధ్వర్యంలో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీఆర్ఎంపి కార్యక్రమంలో భాగంగా హబ్సిగూడ డివిజన్ రోడ్ల మరమ్మతులు, నూతన రోడ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం రూ.21 కోట్ల 60 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు హబ్సిగూడ డివిజన్ నేతలు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. హబ్సిగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్ట్రీట్ నెంబర్ 8 స్వాతి టిఫిన్స్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు గణేష్ నాయక్, డివిజన్ ప్రెసిడెంట్ గన్నారం విజయ్ కుమార్, సీనియర్ నాయకులు లక్ష్మా రెడ్డి, మురళీ కృష్ణ ముదిరాజ్, గుండు రాజన్న, భూక్యా కిషన్ నాయక్, రాజు నాయక్, రమేష్ నాయక్, మాలు నాయక్, డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసు నాయక్, సుమన్ నాయక్, లక్ష్మీ నారాయణ, శివ, రంజిత్, మధు, వేణు, సాయి, గణేష్, రాహుల్, రాహూల్ నాయక్, బి.శివ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం..

మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలక మధుసూదన్ రెడ్డి

తుర్కయంజాల్ ఏప్రిల్ 7(ప్రభాతవార్త) కాంగ్రెస్ పార్టీ నాయకులపై మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆదిబట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూర్ డివిజన్ క్యాంప్ కార్యాలయంలో కోహెడ ఫ్రూట్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలక మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో బిఆర్‌ఎస్ నాయకుల తీరుపై నిప్పులు చెలిగారు. చిలక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, బిఆర్‌ఎస్ నాయకుల ప్రవర్తన వారు మాట్లాడే విధానం సరైనది కాదని, తమ నాయకుడు మల్రెడ్డి రంగారెడ్డిపై అవాకులు చవాకులు మాట్లాడితే సహించే ప్రసక్తే లేదని, బిఆర్‌ఎస్ నాయకులను నియోజకవర్గంలో తరిమికొడతామని హెచ్చరించారు. మా నాయకులు ఒక్కసారి ఆదేశిస్తే, మీ బతుకులు ఏంటో బయటపెడతాం అని ఘాటుగా వ్యాఖ్యానించారు. గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం కంటే దోపిడీయే ఎక్కువగా జరిగిందని మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. తండ్రి కొడుకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎక్కడికక్కడ భూములను ఆక్రమించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేదంటే మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అక్రమాల చిట్టా మొత్తం బయటపెడతామని స్పష్టం చేశారు. కోహెడ ఫ్రూట్ మార్కెట్ విషయంలో గత ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించిందని, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ భాస్కరాచారి, సభ్యులు మధుసూదన్ రావు, మహేశ్వరం నియోజకవర్గం జైపాల్ రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మేకం లక్ష్మీ అంజయ్య, వెంకటేశ్వర్ల గుప్తా, ఇబ్రహీం, మేఘావత్ గణేష్ నాయక్, జంగి రెడ్డి, రఘుపతి రెడ్డి, నవరాజు, మచందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, అజారుద్దీన్, మల్లేష్ నాయక్, పాల్గొన్నారు.



భూబాధిత రైతుల పరామర్శ నిమిత్తం పరిగి వెళ్లే క్రమంలో మంగళవారం ఉదయం శ్రీనగర్‌లోని తన నివాసం వద్దకు వచ్చిన పోలీసులకు క్లాస్ తీసుకుంటున్న మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ పక్ష ఉప నాయకురాలు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి